
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5




శ్రీపొట్టిశ్రీరాములు

నెల్లూరు

జిల్లా వార్తలు

బుధవారం 25 సెప్టెంబరు 2024

బహుభాషా నేపథ్యగాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం (ఎస్పీబీ) పాట జీవించి ఉన్నంతకాలం చిరస్మరణీయుడే. సింహపురి బిడ్డగానేగాక గాయకుడిగా ఆయన ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళ, కన్నడ, హిందీ, భాషాభిమానుల్లో చెరగనిముద్ర వేసుకున్నారు. బుధవారం ఆయన వర్ధంతి సందర్భంగా ప్రత్యేక కథనం.



చిరస్మరణీయుడు గానగంధర్వుడు

పాటలాగా బాలూ అజరామరం

నేడు ఎస్పీబీ వర్ధంతి

'బాలు' గీతాలతో నిత్యస్మరణే!

నెల్లూరు (సాంస్కృతికం) : హరికథా విద్వాంసుడు పండితారాధ్యుల సాంబమూర్తి, శకుంతలమ్మకు 1946 జూన్ 4న నెల్లూరులోని కోనేటమ్మ కోటలో ఎస్పీ బాలు జన్మించారు. తెలుగు, తమిళం, కన్నడ, హిందీభాషలతో పాటు 16 భాషల్లో ఆయన 40వేలకుపైగా సినీ, భక్తి గీతాలు పాడి ప్రపంచ రికార్డు నెలకొల్పారు. 1981లో ఒకేరోజు కన్నడంలో 28 పాటలు పాడి మరో రికార్డు సృష్టించారు. నేపథ్యగాయకుడిగా, నటుడిగా, సంగీత దర్శకుడిగా, డబ్బింగ్ కళాకారుడిగా ఆయన కళామతల్లికి అందించిన సేవలు అనితర సాధ్యమని చెప్పాలి. కాగా 1966లో పద్మనాభం నిర్మించిన శ్రీశ్రీశ్రీ మర్యాదరామన్న చిత్రంతో సినీనేపథ్యగాయకుడిగా ఆరంగేట్రం చేసిన ఆయన, మరణించే వరకు పాటలు పాడారు. నటుల హావభావాల్లో పరకాయ ప్రవేశం చేసేవారు. మంచి గాత్రం ఆయనకు దేవుడిచ్చిన వరం. తెలుగు, తమిళ సినీ రంగంలోని సూపర్‌స్టార్‌లకు ఆయనే నేపథ్యగాయకుడు. డబ్బింగ్ కళాకారుడు. తెలుగు, తమిళ చిత్రాల్లో అతిథి పాత్రలను పోషించారు. ప్రేమికుడు, పవిత్రబంధం, ఆరో ప్రాణం, రక్షకుడు, దీర్ఘసుమంగళీభవ చిత్రాల్లో నటించి ప్రేక్షకులను మెప్పించారు.

● ఆకాశమంత ఎదిగినా..

సాధారణ మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన బాలు స్వయంకృషితో ఆకాశమంత ఎత్తుకు ఎదిగారు. అయితే ఏనాడూ గర్వాన్ని ప్రదర్శించలేదు. ఆయన చదువుకున్న చదువుకు వృత్తికి ఎలాంటి సంబంధంలేదు. ఇంజనీరింగ్ చదివినా ఆయనకు పాటలు పాడడమే ఇష్టం. అందుకే గానానికే తన జీవితాన్ని అంకితమిచ్చారు. ఆయనకు గురువు ఎస్పీ కోదండపాణి. ఆయన స్వరపరిచిన శ్రీశ్రీశ్రీ మర్యాదరామన్న చిత్రంలో తొలిపాట పాడారు. ఆ తర్వాత ఏనాడూ గానం చేయడంలో వెన్ను చూపలేదు.

ఎన్నో అవార్డులు, పురస్కారాలు

తెలుగు పాటలకుగానూ బాలు 25 నంది అవార్డులు అందుకున్నారు. కన్నడ, తమిళ, రాష్ట్రాల నుంచి 14 ఫిలింఫేర్ అవార్డులు, సౌత్ ఇండియా ఫిల్మింఫేర్ అవార్డును అందుకున్నారు. సాహిత్యానికి, పాటలు, పద్యానికి అతను అందించిన సేవలుకుగాను 2012లో ఎన్టీఆర్ జాతీయ అవార్డు, 2015లో కేరళ నుంచి హరివరాసనం, భారతీయ చలన చిత్ర మండలి నుంచి వ్యక్తిత్వ పురస్కారం, 2016లో 47వ ప్రపంచ చలన చిత్ర ఫెస్టివల్ ఆఫ్ ఇండియా అవార్డు, 2001లో పద్మశ్రీ అవార్డు, 2011లో పద్మభూషణ్ అవార్డులు అందుకున్నారు. ఆయన మరణానంతరం పద్మవిభూషణ్ అవార్డు అందుకున్నారు. 2020 వరకు ప్రముఖ నటులకు డబ్బింగ్ చెప్పారు. కమల్‌హాసన్, రజనీకాంత్, విష్ణువర్ధన్, సల్మాన్ ఖాన్, భాగ్యరాజ్, మోహన్, అనీల్‌కుమార్, గిరీష్‌కర్నాడ్, జెమినీ గణేషన్, అర్జున్ సర్జా, నగేష్, కార్తీక్, రఘువరన్, తదితర నటులకు డబ్బింగ్ చెప్పారు. కమల్‌హాసన్ నటించిన 10 పాత్రల విశ్వరూపం చిత్రంలో ఏడు పాత్రలకు ఎస్పీ బాలు డబ్బింగ్ చెప్పారు.

● టెలివిజన్ రంగంలోనూ..

బాలసుబ్రహ్మణ్యం సినీ రంగం నుంచి టెలివిజన్ రంగంలోకి ఆరంగ్రేటం చేశారు. రియాలిటీ షో, పాడుతాతీయగా.. కార్యక్రమాలకు హోస్ట్‌గా, న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. ఆ సమయంలో ఎంతోమంది వర్ధమాన గాయకులను వెలుగులోకి తీసుకువచ్చారు.

● సంగీత పాఠశాలకు ఎస్పీ గృహం

నెల్లూరు మధ్యపతివారివీధిలోని బాలు స్వగృహాన్ని ఆయన కంచి కామకోటి పీఠానికి ఇచ్చి, వేద పాఠశాల, సంగీత పాఠశాలను ఏర్పాటు చేయాలని కోరారు. అందులో ఇంకా కంచి కామకోటి పీఠాన్ని ఏర్పాటు చేయలేదు. మహమ్మారి కోవిడ్-19 బారినపడి 2020 సెప్టెంబరు 25న చెన్నైలో బాలసుబ్రహ్మణ్యం స్వర్గస్తులయ్యారు. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం నెల్లూరులోని ప్రభుత్వ సంగీత పాఠశాలకు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ప్రభుత్వ సంగీత పాఠశాలగా నామకరణం చేసింది. కానీ నిధులు మాత్రం మంజూరు చేయలేదు. కాగా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నెల్లూరు శ్రీవెంకటేశ్వర కస్తూర్బా కళాక్షేత్రంలో ఘంటసాల విగ్రహాన్ని ఘంటసాల అభిమాన సంఘం వారు ఏర్పాటు చేశారు.



తిప్పరాజువారి వీధిలో బాలు ఇల్లు

స్నేహానికి ప్రాణం ఇస్తారు ..



గాన గంధర్వుడు పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం స్నేహానికి ప్రాణం ఇస్తారు. బాల్యం నుంచి ఆయనతో నాకు స్నేహం ఉంది. జిల్లాలోని గాండ్ల, తెలికుల కులస్థులకు బాలసుబ్రహ్మణ్యం తండ్రి పండితారాధ్యుల సాంబమూర్తి కులగురువు. ఆయన తర్వాత బాలసుబ్రహ్మణ్యం కులగురువుగా వ్యవహించారు. హోటల్ మురళీకృష్ణ గ్రూపు వ్యవస్థాపకుడు గ్రోసు గోపాలయ్య కుమార్తెతో నాకు వివాహం అయ్యాక బాలసుబ్రహ్మణ్యం కుటుంబంతో గోపాలయ్య కుటుంబానికి సంబంధ బాంధవ్యాలు ఏర్పడ్డాయి. నవాబుపేటలో మాతా అన్నపూర్ణేశ్వరి వృద్ధుల ఆశ్రమం భవన నిర్మాణానికి నిధులు కోసం బాలసుబ్రహ్మణ్యం ఉచితంగా సంగీత విభావరి నిర్వహించారు. అలాంటి బాలు లేని లోటు తీర్చలేనిది.

- వీరిశెట్టి హజరత్‌బాబు, మురళీకృష్ణ హోటల్స్ ఎండీ

పాట రూపంలో ఉన్నారు..



ఎస్పీబీతో 1995 నుంచి పరిచయం ఉంది. పాడుతా తీయగా ప్రోగ్రాంలో ఆయన అందరి మనసులు దోచుకున్నారు. ఆ కార్యక్రమంలో ఎంతో మంది చిన్నారులను ఆయన గాయకులుగా తీర్చిదిద్దారు. ఆయన నెల్లూరు వస్తే మాకు పండుగే. వీరిశెట్టి హజరత్‌బాబు, తుంగా శివప్రభాత్‌రెడ్డితోపాటు నేనూ బాలుతో బాగా సన్నిహితంగా ఉండేవాళ్లం. బాలుకి నేను కనపడితే కమ్మరకట్ నాయుడు అని పిలిచేవారు. అలాంటి గాయకుడు మరొకరులేరు. ఎస్పీబీ తండ్రి విగ్రహ కమిటీ మెంబరుగా నేనున్నాను. వారి కుటుంబంలో అంతా నన్ను గౌరవిస్తారు. ఆయన లేని లోటు తీరనిది. అయినా పాట రూపంలో ఆయన బతికే ఉన్నారు.

- నలుబోలు బలరామయ్య నాయుడు, ఎస్పీబీ ఆత్మీయ మిత్రుడు

విధేయులకే పట్టం!

కార్పొరేషన్లలో జిల్లాకు సముచిత స్థానం ● తొలివిడతలోనే అన్ని సామాజిక వర్గాలకు అవకాశం



అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డిల ర్యాలీలో బాణసంచా పేల్చుతున్న టీడీపీ కార్యకర్తలు

నెల్లూరు (ఆంధ్రజ్యోతి), సెప్టెంబరు 24 : ఎన్డీఏ కూటమికి పదికి పది అసెంబ్లీ, ఒక ఎంపీ స్థానాన్ని ఇచ్చిన నెల్లూరు జిల్లాకు నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం దక్కింది. జిల్లాకు చెందిన నాయకులకు కీలకమైన రెండు కార్పొరేషన్ చైర్మన్ పోస్టులు దక్కగా, మరో ముగ్గురికి డైరెక్టర్ పదవులు వరించాయి. ఈ పదవుల్లో జిల్లా నుంచి అన్ని సామాజిక వర్గాలకు చోటు దక్కడం విశేషం. అగ్రవర్ణాలు, మైనారిటీలు, బీసీ, ఎస్టీ వర్గాలకు తొలివిడతలోనే పదవులు దక్కాయి. నామినేటెడ్ పోస్టుల్లో అన్ని వర్గాలకు అవకాశం కల్పించడం, కీలక నాయకులకు పదవులు కట్టబెట్టడం పట్ల కూటమి శ్రేణుల్లో సంతృప్తి వ్యక్తం అవుతోంది.

● వక్ఫ్‌బోర్డు చైర్మన్‌గా అజీజ్



టీడీపీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్‌కు ప్రతిష్టాత్మకమైన రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ పదవి వరించింది. 2014 నుంచి 2024 వరకు పదేళ్లపాటు ఆయన పార్టీకి సేవలందించారు. 2014-19లో నెల్లూరు కార్పొరేషన్ మేయర్‌గా నగరాభివృద్ధికి, పార్టీ బలోపేతానికి కృషి చేశారు. 2019 ఎన్నికల్లో నెల్లూరు రూరల్ నుంచి టీడీపీ అభ్యర్థిగా బరిలో దిగి ఓటమిని చవిచూశారు. అప్పటి నుంచి 2024 ఎన్నికల ముందు వరకు నెల్లూరు రూరల్ టీడీపీ ఇన్‌చార్జిగా వ్యవహరించారు. 2022 నుంచి ఇప్పటివరకు నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడిగా కూడా ఉన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో టికెట్టు దక్కకపోయినా పార్టీ కోసం శక్తివంచన లేకుండా కృషి చేశారు. టీడీపీ అభ్యర్థుల గెలుపు కోసం జిల్లావ్యాప్తంగా ప్రచారం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అబ్దుల్ అజీజ్‌కు కీలక పదవి దక్కుతుందని అందరూ ఊహించారు. అనుకున్నట్లుగానే ప్రతిష్టాత్మకమైన రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ పదవి ఆయన్ను వరించింది. రాష్ట్రంలో రైల్వే తరువాత విశాలమైన భూభాగం కలిగిన సంస్థ వక్ఫ్‌బోర్డు. ఈ సంస్థ ఆస్తుల విషయంలో అనేక వివాదాలు నడుస్తున్నాయి. సమర్థుడైన అబ్దుల్ అజీజ్ ఈ వివాదాలను పరిష్కరించి, వక్ఫ్‌బోర్డు భూములు పరిరక్షిస్తాడన్న నమ్మకంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ పదవీ బాధ్యతలు అప్పగించారని టీడీపీ సీనియర్ నాయకులు అంటున్నారు. కాగా, అబ్దుల్ అజీజ్‌కు పదవి దక్కడంతో ఆయన అభిమానులు, టీడీపీ శ్రేణులు మంగళవారం రాత్రి నగరంలో భారీ ర్యాలీ నిర్వహించాయి. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రాజానాయుడు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు కేకు కట్ చేశారు.

● టిడ్కో చైర్మన్‌గా అజయ్‌కుమార్



అజయ్‌కుమార్‌కు అభినందనలు తెలుసుతున్న సుజయ్‌బాబు

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు అత్యంత నమ్మకస్తుడు, జనసేన కేంద్ర మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయ్ కుమార్‌కు ప్రతిష్టాత్మకమైన టిడ్కో చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈయన నెల్లూరు వాసి. ప్రముఖ న్యాయవాది అనంత రామయ్య కుమారుడు. పవన్‌కల్యాణ్ ఆశయాలకు ఆకర్షితుడై జనసేన పార్టీలో చేరారు. పార్టీ బలోపేతానికి చేస్తున్న కృషి నేపథ్యంలో ఆయన పవన్ కుటుంబానికి అత్యంత సన్నిహితుడిగా మారారు. పార్టీలో కీలక నాయకుడిగా, నిజాయతీపరుడిగా గుర్తింపు పొందారు. ఈ క్రమంలో జనసేన కోటా కింద టిడ్కో చైర్మన్ పదవి అజయ్‌కుమార్‌కి దక్కింది.

● ముగ్గురికి డైరెక్టర్ పోస్టులు

జిల్లాకు చెందిన ముగ్గురు నాయకులకు రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ పోస్టులు దక్కాయి. మంత్రి నారా లోకేష్‌బాబుకు సన్నిహితుడైన వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డికి ఏపీ సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దక్కింది. అలాగే బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన తాళ్ల నరసింహస్వామి పద్మశాలి వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈయన తెలుగుదేశంలో సీనియర్ కార్యకర్త. నరసింహస్వామి కుమార్తె బుచ్చి నగర పంచాయతీ కౌన్సిలర్‌గా ఉన్నారు. చేనేత రంగంలో క్రియాశీలకంగా ఉన్నారు. ఏపీ షెడ్యూల్ ట్రైబ్స్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కావలి నియోజకవర్గం అల్లూరు మాజీ సర్పంచు తిరువేది అనురాధ నియమితులయ్యారు. సుదీర్ఘ కాలంగా టీడీపీ కార్యకర్తగా కొనసాగుతున్నారు.



అనురాధ



తాళ్ల నరసింహస్వామి



పట్టాభిరామిరెడ్డి

హలం పట్టి.. పొలం దున్ని!



కొడవలూరు : రామన్నపాళెంలో పొలం దున్నుతున్న కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

జిల్లావ్యాప్తంగా మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం ఎంతో ఆర్భాటంగా ప్రారంభమైంది. ప్రతి మండలంలోనూ రెండేసి గ్రామాల్లో అధికారులు రైతు సేవా కేంద్రాల్లో సదస్సులు నిర్వహించి, రైతులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం సాగులో ఉన్న వరి, వేరుశనగ, పత్తి, కూరగాయల పంటలను పరిశీలించి, రైతులకు సూచనలు ఇచ్చారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కొడవలూరు మండలం రామన్నపాలెంలో నాగలిపట్టి పొలం దున్నారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ జలదంకి మండలం రామవరప్పాడులో వ్యవసాయశాఖ రూపొందించిన పోస్టరును ఆవిష్కరించి, కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లాలోని కావలి, కందుకూరు ఎమ్మెల్యేలు డీవీ కృష్ణారెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావులు వివిధ గ్రామాల్లో జరిగిన 'పొలం పిలుస్తోంది'లో పాల్గొన్నారు. వ్యవసాయశాఖ, దాని అనుబంధ శాఖల అధికారులు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

అదే ఉత్కంఠ!

- కొనసాగుతున్న బదిలీలు
- ఇంకా పలు శాఖల్లో పూర్తికాని ప్రక్రియ
- గడువు ముగిసినా వెలువడని జాబితాలు
- ఎమ్మెల్యేల లేఖలతో ఇబ్బందులు

నెల్లూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగుల బదిలీ ప్రక్రియ ప్రహసనంగా మారింది. ప్రభుత్వం దాదాపు నెలన్నర సమయం ఇచ్చినా ఇంకా చాలా శాఖలు బదిలీల ప్రక్రియను పూర్తి చేయకపోతున్నాయి. పంచాయతీ విభాగం, జిల్లా పరిషత్, డీఆర్‌డీఏ, ఇరిగేషన్, సచివాలయాలు వంటి శాఖలకు సంబంధించి ఇంకా బదిలీలు పూర్తికాలేదు. బదిలీలకు ఈ నెల 22 వరకు ప్రభుత్వం గడువు ఇచ్చినా నేటికీ అది అసంపూర్తిగానే ఉంది. ఇందుకు ఆయా శాఖల అధికారుల పనితీరు ఒక కారణం కాగా, మరో కారణం ఎమ్మెల్యేల నుంచి సిఫార్సు లేఖలు ఇబ్బడి ముబ్బడిగా రావడం. చాలా వరకూ ఎమ్మెల్యేల కార్యాలయాల నుంచే సిఫార్సుల జాబితా ఆయా శాఖలకు చేరింది. అయితే తొలుత ఒక పోస్టుకు ఒక లెటర్ ఇచ్చాక.. మళ్లీ కొన్ని రోజులకు మరొకరికి అదే పోస్టుకు లెటర్ ఇచ్చారు. ఇలా ఒక్కో పోస్టుకు రెండు, మూడుపేర్లు రావడంతో గందరగోళంగా మారినట్లు అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది. బదిలీలు పూర్తయిన రెవెన్యూ వంటి శాఖలకు కూడా ఈ సిఫార్సుల సమస్య తలనొప్పిగా మారింది. ఇదిలా ఉండగా పంచాయతీ విభాగం పరిధిలో సెక్రటరీలు, డిజిటల్ అసిస్టెంట్ పోస్టులకు సంబంధించి సుమారు 320 మందికి చాలా రోజుల క్రితమే బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. కానీ ఇంత వరకు బదిలీలు పూర్తి కాలేదు. జిల్లా పరిషత్‌లోనూ ఇదే పరిస్థితి. ఎంత మంది బదిలీ అవుతున్నారన్న సంఖ్యను వెలువరించారే తప్ప ఎవరెవరు ఎక్కడెక్కడకు బదిలీ అవుతున్నారన్నది మాత్రం వెల్లడించలేదు. డీఆర్‌డీఏలో కూడా సుమారు వంద మంది ఉద్యోగుల వరకూ బదిలీ అవ్వాల్సి ఉందని సమాచారం. కానీ ఒక కొలిక్కి రాలేదు. ఇరిగేషన్‌లో బదిలీలు జరిగినట్లు ఈ నెల 22వ తేదీనే ఉత్తర్వులు వెలువడ్డాయి. కానీ ఇంత వరకు బదిలీ చేసిన వారి జాబితా వెలుగుచూడలేదు. ఈ నేపథ్యంలో వందల మంది ఉద్యోగులు బదిలీ ఆర్డర్ల కోసం ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.



అడుగంటిన 'రాళ్లపాడు' ప్రాజెక్టు

● సాగు, తాగునీటికి ఇబ్బందులు తప్పవేమో! ● 'సోమశిల' నీరే శరణ్యం

లింగసముద్రం, సెప్టెంబరు 24 : వంద గ్రామాలకు పైగా సాగు, తాగునీరు అందించి రాళ్లపాడు ప్రాజెక్టు అడుగంటింది. ప్రస్తుతం ప్రాజెక్టులో కేవలం 6.6 అడుగుల నీటిమట్టం ఉంది. ఇది నాలుగు అడుగులకు పడిపోతే డెడ్ స్టోరేజీకి చేరిపోతుంది. వర్షాలు కురవక ఎగువ నుంచి ప్రవాహం లేకపోవడంతో డ్యాంలో ఉన్న నీరు పచ్చగా మారింది. ఈ నీటినే ఫిల్టర్ చేసి గుడ్లూరు, రాళ్లపాడు-రోళ్లపాడు, చుండి- చెర్లోపాలెం మంచినీటి పథకాల ద్వారా గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. అయినా నీరు పచ్చగా ఉంటోందని ప్రజలు వాపోతున్నారు. ఈ పరిస్థితుల్లో నీటి అవసరాలకు సోమశిల రిజర్వాయర్ నుంచి కృష్ణా జలాలను అందించి ఆదుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుతం సోమశిలలో 52 టిఎంసీల వరకు నీరు ఉంది వాస్తవానికి సోమశిల నుంచి రాళ్లపాడు ప్రాజెక్టుకు 1.5 టిఎంసీల నీరు రావాల్సి ఉంది. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమశిల ప్రాజెక్టును సందర్శించినప్పుడు, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు రాళ్లపాడుకు నీరిచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. అధికారులు కూడా చొరవ తీసుకుని రాళ్లపాడుకు నీటిని అందించి, దాహం తీర్చాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.



మంచినీటి పథకం నుంచి పచ్చగా వచ్చిన నీరు

అంగన్‌వాడీలకు మహర్దశ

● మౌలిక వసతుల కోసం రూ.2.61 కోట్ల మంజూరు

నెల్లూరు (హరనాథపురం), సెప్టెంబరు 24 : సమస్యలతో కునారిల్లుతున్న అంగన్వాడీ కేంద్రాలకు మహర్దశ పట్టనుంది. ఈ కేంద్రాలలో మౌలిక వసతులు కల్పనకు కూటమి ప్రభుత్వం రూ.2.61 కోట్లకుపైగా మంజూరు చేసింది. సొంత భవనాలు ఉన్న అంగన్వాడీ కేంద్రాలలో మరుగుదొడ్ల నిర్మాణానికి, తాగునీటి వసతి కల్పించడానికి ఈ నిధులు ఖర్చు చేయనున్నారు. ఒక్కో అంగన్వాడీ కేంద్రంలో మరుగు దొడ్డి నిర్మాణానికి రూ.36వేలు వంతున ఖర్చు చేయనున్నారు. ఈ లెక్కన 486 కేంద్రాలలో 1,74,96,000 రూపాయలు వెచ్చించనున్నారు. అలాగే మంచినీటి వసతికి రూ.17వేల వంతున మంజూరవగా, 507 కేంద్రాలలో 86,19,00 రూపాలు ఖర్చు చేయనున్నారు. ఇక జిల్లాలో 2,934 అంగన్వాడీ కేంద్రాలు ఉండగా, సొంత భవనాలు కలిగినవి 1037, అద్దె భవనాల్లో 732 కేంద్రాలు నడుస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలలు, ఇతర ప్రభుత్వ భవనాల గదుల్లో (రెంట్ ఫ్రీ) 1,165 కేంద్రాలు ఉన్నాయి. అద్దెలేని భవనాలు అంటే అంగన్వాడీల నిర్వహణ కార్యకర్తలకు తలకు మించిన భారంగా మారింది. ఇక్కడ కనీస వసతులు లేవు. సొంత భవనాల్లోనూ గత ప్రభుత్వం చేపట్టిన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ దశలో కూటమి ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనకు పూనుకుని వాటి బాగోగులపై దృష్టి సారించి, నిధులు విడుదల చేసింది. ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్ మాట్లాడుతూ సొంత భవనాల్లో నడుస్తున్న కేంద్రాలలో మరుగుదొడ్లు, మంచినీటి వసతి కల్పించనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన పనులను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చేపడతారని వెల్లడించారు.



'మైనింగ్'లో సందడి

నెల్లూరు (వెంకటేశ్వరపురం) సెప్టెంబర్ 24 : ఇసుక రవాణా చేసే వాహనాలకు రిజిస్ట్రేషన్ చేసుకోనేందుకు యజమానులు మంగళవారం మైనింగ్ కార్యాలయానికి క్యూకట్టారు. నూతన విధానంలో భాగంగా ఇసుక రవాణా చేసే వాహనాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో రిజిష్టర్ చేసుకోవాలి. అంతేగాక అన్ని వాహనాలకు జీపీఎస్‌తోపాటు అన్ని రకాల పత్రాలు ఉండాలి. వీటన్నిటితో మైనింగ్ కార్యాలయంలో రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంది. దీంతో ఆటోనగర్ సమీపంలోని తప్పగిరికాలనీలో ఉన్న మైనింగ్ కార్యాలయానికి వాహన యజమానులు భారీగా చేరుకొన్నారు. వాహనాన్ని బట్టి ట్రాక్టర్‌కు రూ. 1500, 6టైర్ల లారీకి రూ.3000, 10 టైర్ల లారీకి రూ.6000 , 12, 14, 16 టైర్ల లారీలకు రూ.10వేలు రుసుమును నిర్ణయించారు.



మైనింగ్ కార్యాలయంలో వాహనాల యజమానులు

'విజయ'లో ముగ్గురు డైరెక్టర్లు ఏకగ్రీవం

నెల్లూరు (వెంకటేశ్వరపురం) : నెల్లూరు విజయ డెయిరీ (నెల్లూరు జిల్లా పాల ఉత్పత్తి దారుల పరస్పర సహాయ సహకార సమితి)లో మూడు డైరెక్టర్ పదవులు ఏకగ్రీవం అయ్యాయి. ఈ పదవులకు నలుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా, మంగళవారం తిరుమల పూడి పాలసొసైటీ సభ్యుడు తాళ్ళూరు బాబునాయుడు తన నామినేషన్‌ను ఉపసంహరించుకొన్నారు. దీంతో మిగతా ముగ్గురు అభ్యర్థులు డైరెక్టర్ పదవులకు ఏకగ్రీవంగా ఎంపికైనట్లు ఎన్నికల అధికారి హరిబాబు ప్రకటించారు. ఎన్నికైన అన్నారెడ్డి పాళెం పాల సొసైటీ సభ్యుడు అన్నం శ్రీహరి, నారికేళ్లపల్లి సభ్యుడు కోట చంద్రశేఖర్‌రెడ్డి, వాసిలి సభ్యుడు గంగా శ్రీనివా సులుకు డైయిరీ ఉద్యోగులు, పాల సొసైటీ సభ్యులు అభినందనలు తెలిపారు.

వరద బాధితులకు వాకర్స్ విరాళాలు



జాయింట్ కలెక్టర్‌కు చెక్కులు అందిస్తున్న వీఆర్‌సీ వాకర్స్ సభ్యులు

నెల్లూరు (విద్య), సెప్టెం బరు 24 : విజయవాడ వరద బాధితుల సహాయార్థం నగరంలోని పలు వాకర్స్ సంఘాలు విరాళాలు అందజేశాయి. సీఎం సహాయ నిధికి సుమారు రూ.4.50 లక్షలను అందించాయి. మంగళవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ కే కార్తీక్‌ను ఆయా సంఘాల నాయకులు కలిశారు. వీఆర్‌సీ వాకర్స్ అసోసియేషన్ నుంచి రూ.1లక్ష, ఆర్ఎస్ఆర్ వాకర్స్ అసోసియేషన్ రూ.75 వేలు, ఎస్పీఎస్ ఆర్ జడ్పీ వాకర్స్ అసోసియేషన్ రూ.50వేలు, పుత్తా ఎస్టేట్ వాకర్స్ అసోసి యేషన్ రూ.5వేలు, షై వాకర్స్ అసోసియేషన్ రూ.12,200కు వేర్వేరుగా చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో సుబ్బారెడ్డి, నళినీ మోహన్, సుధాకర్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, రాఘవరెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.1,10,000లను, ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వాక ర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.1,01,616 కు చెక్కులను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి అందచేశారు. ఈ విరాళాలను సీఎం రిలీఫ్ ఫండ్‌కు పంపిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్య క్రమంలో వాకర్స్ గవ ర్నర్ పీ శ్రీనివాసరెడ్డి, వాకర్స్ ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్ నలుబోలు బలరామ య్యనాయుడు, ఫ్రెండ్స్ వాకర్స్ సంఘం అధ్యక్షుడు బిరదవోలు రామ్మోహన్ రెడ్డి, ఏసీ స్టేడియం వాకర్స్ సంఘం అధ్యక్షుడు అనంత రామారావు తదితరులు పాల్గొన్నారు. కాగా రూరల్ ఎమ్మెల్యేకు వాకర్స్ సంఘాలు ఇప్పటి వరకు అందించిన విరాళాలకు సంబంధించి రూ.5.80 లక్షలకు చెక్కులను మంగళవారం టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి కలెక్టర్ ఆనంద్‌కు అందజేశారు.



ప్రైవేటు స్కూలు విద్యార్థులు.. రూ.2.41 లక్షల విరాళం



అపుస్మా అధ్యక్షుడికి చెక్కు అందజేస్తున్న సోమిరెడ్డి

పొదలకూరు: విజయవాడ వరద బాధితుల సహాయార్థం పట్టణంలోని అమరావతి స్కూల్ యాజమాన్యం, విద్యార్థులు, ఉపాధ్యాయులు, పట్టణంలోని కొందరు ద్వారా సేకరించిన మొత్తం రూ.2,41,001 మంగళ వారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి సమక్షంలో సర్వేపల్లి ప్రైవేటు స్కూల్ అసోసియేషన్ (అపస్మ) అధ్యక్షుడు సుబ్బరాయులకు అందజేశారు. ఇలా సేకరించిన విరాళాలను అపస్మ అన్ని జిల్లాల అధ్యక్షులు ఒకేసారి సీఎంను కలిసి అందజేస్తారని పాఠశాల కరస్పాండెంట్ కె.సురేష్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పీవీ.సురేష్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సాయం రూ.15 లక్షలు



సీఎంకు చెక్కు అందజేస్తున్న మత్స్యకార నేతలు

కావలి రూరల్ : సీఎం సహాయ నిధికి జిల్లాకు చెందిన మత్స్యకారులు రూ.15 లక్షల సాయం అందజేశారు. మంగళ వారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసిన మత్స్యకారులు తాము సేకరించిన రూ.15 లక్షల చెక్కును అందజేశారు. సీఎంను కలిసిన వారిలో ఆఫ్కాబ్ మాజీ ఛైర్మన్ కొండూరు పాలిశెట్టి, టీడీపీ జిల్లా మత్స్యకార సెల్ అధ్యక్షుడు పామంజి శేషయ్య, నాయకులు జయచంద్ర నాయుడు, గోవిందు, కోట రవి, దిలీప్, వాసు, వాయిల తిరుపతి, యల్లంగారి బాబు, మహేంద్ర తదితరులు ఉన్నారు.

ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ సాయం రూ.1,01,116



మంత్రి నారాయణకు వరద సాయం చెక్కు అందజేస్తున్న బులియన్ మర్చంట్స్

నెల్లూరు (సాంస్కృతికం): విజయవాడ వరద బాధితుల సహాయం కోసం ది ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ అండ్ పాన్ బ్రోకర్స్ అసోసియేషన్ సోమవారం రాత్రి రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణకు రూ.1,01,116ల చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కొనగళ్ల శోభన్‌బాబు, ప్రధాన కార్యదర్శి ఏవీ ఫణీంద్రకుమార్, కోశాధికారి భోగనాధం సుబ్రహ్మణ్యం, సహాయ కార్యదర్శి చందాలు సతీష్‌కుమార్, సభ్యులు పాల్గొన్నారు. నూతన లైసెన్స్, రెన్యువల్ లైసెన్స్‌లను ఆన్‌లైన్ ద్వారా చేసేందుకు అనుమతులు ఇవ్వాలని మంత్రికి నాయకులు వినతిపత్రం అందజేశారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

- ఐఎంఎల్ డీపో వద్ద సూపర్‌వైజర్ల ఆందోళన

నెల్లూరు రూరల్, సెప్టెంబరు 24 : మండలంలోని దేవరపాళెంలో ఉన్న మద్యం నిల్వ గోదాముల వద్ద మద్యం దుకాణాల సూపర్‌వైజర్లు మంగళవారం ఆందోళనకు దిగారు. అక్టోబరు 1 నుంచి రాష్ట్ర ప్రభుత్వం కొత్త మద్యం పాలసీ తీసుకువస్తున్నం దున తమ ఉద్యోగాలకు అభద్రత ఏర్పడిందంటూ నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమకు ఉద్యోగ భద్రత కల్పించడమేకాక ఇరత శాఖల్లో సర్దుబాటు చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా మద్యం షాపుల్లో పనిచేస్తున్న 15 వేల మంది సూపర్‌వైజర్లు కొత్త పాలసీతో రోడ్డునపడనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ బేవరేజస్ కార్పొరేషన్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం నాయకులు నరేంద్ర, వంశీ, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఏసీగా జనార్దన్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 24 : దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్(ఏసీ)గా మంగళవారం ఉదయం కోవూరు జనార్దన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు సహాయ కమిషనర్‌గా ఉన్న జే శ్రీనివాస్‌రావు బాధ్యతలు అప్పగించారు. అనంతరం జనార్దన్‌రెడ్డి కార్యాలయ సిబ్బందితో మాట్లాడుతూ సమన్వయంతో పనిచేసి దేవదాయ శాఖకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. సిబ్బంది సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు రాజరాజేశ్వరి ఆలయ వేద పండితుడు రామకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో పండితులు ఆశీర్వచనాలు అందజేశారు.

- చికిత్సల్లో ఫార్మసిస్టుల పాత్ర ప్రముఖం
- కొవిడ్ విపత్తులో విశేష సేవలు
- అనుమతుల్లేకుండా జిల్లాలో కొన్ని మందుల షాపులు
- నేడు ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం

రోగాల నియంత్రణలో మందులే కీలకం



నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 24 : నేటి సమాజంలో ఎన్నో రకాల వ్యాధులు ప్రబలుతుండగా వాటిని నయం చేయడంలో వైద్యులు రాసే మందులు కీలకం. డాక్టర్ రాసిన మందును అర్థం చేసుకుని సరైనది నిర్దేశిత కాలం వాడితే రోగాలు తగ్గుముఖం పడతాయి. ఇలా వైద్యులు సూచించిన మందులను కచ్చితమైనవి అందించే వారే ఫార్మాసిస్టులు. వైద్యులు మందుల చీటీని విడి అక్షరాలలో రాయాలన్న నిబంధన ఉన్నప్పటికీ నేటికీ ఎంతో మంది వైద్యులు కలిపి రాతతో మందులు రాస్తున్నారు. ఈ క్రమంలో ఆ మందులను అర్థం చేసుకుని సరైన వాటిని వ్యాధిగ్రస్తులకు ఇవ్వడంలో ఫార్మసిస్టుల పాత్ర ఎంతో ఉంది. అయితే కొందరు వైద్యులు కొన్ని కంపెనీల మందులకే ప్రాధాన్యమివ్వడం, మార్కెట్‌లోకి నకిలీ మందులు విచ్చలవిడిగా రావడంతో ఫార్మసిస్టులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రపంచ వ్యాప్తంగా రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్న నినాదంతో ఏటా సెప్టెంబరు 25వ తేదీన ఇంటర్నేషనల్ ఫార్మాస్యూటికల్స్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు.

సకాలంలో రోగులకు అందుబాటులో ఉంటున్నాం



జిల్లాలో మా అసోసియేషన్‌లో 2300 మంది వరకు సభ్యులు ఉన్నారు. అందరం ఫార్మసీ కోర్సు పూర్తి చేసి మందుల షాపులు నిర్వహిస్తున్నాం. సకాలంలో రోగులకు అందుబాటులో ఉంటున్నాం. వైద్యులు రాసిన మందులకు కొరత లేకుండా చూస్తున్నాం. ఫార్మసిస్టులు, ప్రభుత్వ అనుమతి లేకుండా మందుల దుకాణాలు నిర్వహించే వారిపై అధికారులు చర్యలు తీసుకుంటారు. అందుకు మా సహకారం ఉంటుంది.

- పేరూరి ప్రదీప్, నెల్లూరు జిల్లా కెమిస్ట్స్, డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

అనేక సమస్యలు ఉన్నాయి



జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రిల్లో 130 మందికిపైగా ఫార్మసిస్టులు పనిచేస్తున్నారు. వీరిలో 90 మంది వరకు రెగ్యులర్ ఉద్యోగులే. మిగిలిన వారిని కూడా రెగ్యులర్ చేయమని ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నాము. కరోనా సమయంలో ఎంతో కష్టపడ్డాం, రాత్రి, పగలు అన్న తేడా లేకుండా రోగులకు సకాలంలో మందులు అందుబాటులో ఉండేలా కృషి చేశాం.

- నరసింహులు, ఫార్మసిస్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

కరోనాలోనూ కీలకంగా ఫార్మసిస్టులు

కరోనా వైరస్ విజృంభిన 2020 నుంచి 2022 వరకు జిల్లాలో 1.66 లక్షల మంది కొవిడ్ వ్యాధి బారినపడ్డారు. వారు కోలుకోవడానికి ఫార్మసిస్టులు అందించిన మందులే కీలకంగా మారాయి. రోగులు త్వరితగతిన కోలుకునేందుకు వారు చేసిన కృషి ఎంతో ఉంది.

ఫార్మసిస్టులు లేకుండానే దుకాణాలు

జిల్లాలో 4వేలకుపైగా మందులు షాపులు ఉన్నాయి. సాధారణంగా ఫార్మాసిస్టులకే మందుల దుకాణాల నిర్వహణకు అనుమతి స్తారు. అయితే చాలా వాటిలో ఫార్మసిస్టులే ఉండటం లేదు. కొందరైతే ఫార్మసిస్టుల ద్వారా దుకాణానికి అనుమతులు తీసుకుంటూ స్వంతంగా నడుపుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అయితే సాధారణ ఆరోగ్య సమస్యలకు ఉపయోగించే మందులు కిరాణా షాపుల్లోనూ విక్రయిస్తున్నారు. ఇలా అర్హతలేని వారంతా మందులు విక్రయించడం వల్ల, వాటిని వాడిన వారికి రోగాలు నయం కాకపోగా కొత్త సమస్యలు వస్తున్నాయి. ఈ పరిస్థితిని నిరోధిం చాల్సిన అధికారులు ఆ దిశగా పూర్తి స్థాయి కృషి చేయటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొందరు గ్రామీణ వైద్యులయితే ఫార్మసిస్టుల పాత్ర పోషిస్తూ వారే మందులను దగ్గర ఉంచుకుని వైద్య సేవలు చేస్తున్నారు. ఇలాంటి వారి వల్ల ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురవుతారని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

27న ఐటీఐలో ఉద్యోగమేళా

నెల్లూరు (విద్య): ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయిమెంట్ కార్యాలయం, సీడాప్ సంయుక్తంగా ఈనెల 27వతేదీన వెంకటేశ్వరపురం ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాలలో ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ కే శ్రీధర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సంబంధిత తేదీలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు భార్గవి ఆటోమెబైల్స్, కోల్గేట్ పామోలివ్, టీవీఎస్ ట్రైనింగ్ అండ్ సర్వీసెస్, అమర్ రాజా బ్యాటరీస్, స్పందన స్ఫూర్తి ఫైనాన్షియల్ లిమిటెడ్, కాంటినెంటల్ కాఫీ సంస్థలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయని తెలిపారు. పదో తరగతి నుంచి డిగ్రీ వరకు, ఐటీఐ, డిప్లమో చదివిన వారు అర్హులన్నారు. పూర్తి వివరా లకు ఫోన్ 9494456326, 7989613024 నెంబర్లను సంప్రదిం చాలని కోరారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఆత్మకూరు, సెప్టెంబరు 24 : పోలీసులు మంగళ వారం తెల్లవారుజామున ఆకస్మిక దాడులు నిర్వహించి, అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్ట ర్లను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కి తరలించారు. సీఐ గంగాధరరావు, ఎస్ఐ జిలానీ పోలీస్ సిబ్బందితో కలిసి రెండు బృందాలుగా ఏర్పడి దాడులు నిర్వహించారు. అప్పా రావుపాళెం నుంచి వెళుతున్న రెండు ఇసుక ట్రాక్టర్లను, గండ్లవీడు వద్ద మరో రెండు ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

సోమశిలలో 51.799 టీఎంసీల నీరు నిల్వ

అనంతసాగరం, సెప్టెంబరు 24: సోమశిల జలాశయాలనికి ఎగువ నుంచి మంగళవారం 19,753 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ 77.988 టీఎంసీలు కాగా, 51.799 టీఎంసీలకు చేరుకుంది. దిగువ డెల్టాకు 600, కండలేరుకు 10,000, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నామన్నారు.

సౌర విద్యుత్ అమర్చుకోండి!

- జిల్లావాసులకు కలెక్టర్ విజ్ఞప్తి
- అవగాహన కల్పించాలని అధికారులకు ఆదేశం

నెల్లూరు (జడ్పీ), సెప్టెంబరు 24 : కేంద్ర ప్రభుత్వం సబ్సిడీతో మంజూరు చేస్తున్న సౌర విద్యుత్ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆనంద్ ప్రజలను కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాలులో సౌరవిద్యుత్తుపై జరిగిన జిల్లాస్థాయి కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. పీఎం సూర్యఘర్ ముక్తి బిజిలీ యోజన పథకంపై ప్రజలందరికీ అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఒక కిలో వాట్‌కు నెలకు 120 యూనిట్లు, 2కిలో వాట్లకు 240 యూనిట్లు, 3కిలోవాట్లకు 360 యూనిట్లు చొప్పున సౌర విద్యుత్తును పొందేందుకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందన్నారు. కిలో వాట్‌కు రూ.30వేలు, రెండు కిలోవాట్లకు రూ.60వేలు, 3కిలోవాట్లకు రూ.78వేలు సబ్సిడీ ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ సౌరవిద్యుత్తుతో ప్రజలకు, మరింత మేలు జరుగుతుందని, ప్రతి ఒక్కరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం సౌరవిద్యుత్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమీక్షలో జడ్పీ సీఈవో కన్నమనాయుడు, ఎస్ఈ విజయన్, ఈఈ సోమశేఖరరెడ్డి, శ్రీధర్, బాలచంద్ర తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు



స్కానింగ్ కేంద్రంలో రికార్డులు తనిఖీ చేస్తున్న అధికారులు

నెల్లూరు (వైద్యం), సెప్టెం బరు 24 : నెల్లూరులోని పలు స్కానింగ్ కేంద్రాలను వైద్య ఆరోగ్యశాఖ అధికారులు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏడీఎం హెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి ఆధ్వర్యంలో జిల్లా మాస్ మీడియా అధికారి కనకరత్నంతో పాటు డీఎల్ఎస్‌సీ సభ్యురాలు కుసుమకుమారి, సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. రికార్డు లను, ఫాం-ఎఫ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఖాదర్‌వలి మాట్లాడుతూ స్కానింగ్ కేంద్రాలు ఎట్టి పరిస్థితిలోనూ లింగ నిర్ధారణ పరీక్షలు చేయకూడదన్నారు. దీన్ని అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్కానింగ్ పరీక్షల వివరాలు ఆన్‌లైన్ పోర్టర్‌లో నమోదు చేయాలని, ప్రతి నెల 2వ తేదీన ఆ వివరాలు వైద్య ఆరోగ్యశాఖలోని డెమో విభాగంలో సమర్పించాలని స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం కో ఆర్డినేటర్ శ్రావణ్‌మార్ కూడా పాల్గొన్నారు.

వాహనాల లైసెన్సు, ఫిట్‌నెస్‌ను ప్రైవేట్‌కు ఇవ్వొద్దు

- రవాణా కార్యాలయం వద్ద లారీ ఓనర్లు, ఆటో కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న ఆటో, లారీ ఓనర్సు అసోసియేషన్ నాయకులు

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 24 : వాహనాల డ్రైవింగ్ లైసెన్సు, ఫిట్నెస్ గుర్తింపు బాధ్యతలను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించొద్దంటూ రవాణా శాఖ కార్యాలయం వద్ద ఆటో కార్మిక సంఘం, జిల్లా లారీ ఓనర్సు అసోసియేషన్ మంగళవారం ధర్నా చేశాయి. సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆటోకార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు ప్రసాద్ మాట్లాడుతూ ఎంవీ యాక్ట్ సవరణ బిల్లు ప్రకారం కేంద్ర ప్రభుత్వం వాహనాల ఫిట్నెస్ సర్టిఫికెట్‌ను సెన్సార్ పద్ధతిలో ఇవ్వటం సరైన నిర్ణయం కాదన్నారు. దీనివల్ల లక్షలాది మంది వాహన యజమానులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందన్నారు. లారీ ఓనర్సు సంఘం జిల్లా కార్యదర్శి దామోదర్‌రెడ్డి, నాయకులు కొండస్వామి, మల్లారెడ్డి మాట్లాడుతూ రవాణారంగాన్ని నిర్వీర్యం చేసే విధానాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విరమించుకోవాలని కోరారు. ప్రభుత్వం దిగిరాక పోతే రవాణ రంగాన్ని పూర్తిగా స్తంభింప చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆటో కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రాజా, సురేష్, సీఐటీయూ నాయకులు బత్తల కిష్టయ్య, కొండా ప్రసాద్, కిన్నెర కుమార్, ఆటోకార్మిక సంఘం నేతలు మురళి, శ్యామ్సన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్ శిబిరాలు సద్వినియోగం చేసుకోండి

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య



ప్రదర్శనను ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 24 : కేన్సర్ స్ర్కీనింగ్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య పిలుపునిచ్చారు. కమ్యూనిటీ పారామెడిక్స్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నెల్లూరులోని అంబేద్కర్ బొమ్మ నుంచి గాంధీబొమ్మ వరకు ప్రదర్శన జరిగింది. కేన్సర్ భూతాన్ని తరిమేద్దాం... కాలుష్య నివారణే కేన్సర్ నివారణ... మద్యం తాగొద్దు కేన్సర్ బారిన పడొద్దు అన్న నినాదాలిచ్చారు. ఈ ప్రదర్శనను డీఎంహెచ్‌వో ప్రారంభించి ప్రసంగించారు. అత్యంత ప్రమాదకరమైన వ్యాధులలో కేన్సర్ ఒకటని, దీనిపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు పీహెచ్‌పీలు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఉచిత కేన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నారాయణ దంత వైద్య కళాశాల హెచ్‌వోడీ డాక్టర్ నటరాజన్ కన్నన్ మాట్లాడుతూ ధూమపానం. మద్యపానానికి దూరంగా ఉండాలన్నారు. జిల్లా యూత కోఆర్డినేటర్ మహేంద్రరెడ్డి మాట్లాడుతూ దురలవాట్లకు దూరంగా ఉండాలని, పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సుస్మిత, దిలీప్ నర్సింగ్ కళాశాలల విద్యార్థులు, నారాయణ దంత కళాశాల విద్యార్థులు, పీహెచ్‌పీ సంఘం గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, రూడ్స్ ట్రస్ట్ ఛైర్మన్ షేక్ రసూల్ పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి పూరిల్లు దగ్ధం

- రోడ్డున పడ్డ బాధితులు



గృహోపకరణాలతో సహా దగ్ధమైన ఇల్లు

తోటపల్లి గూ డూరు, సెప్టెం బరు 24 : మండ లంలోని తోటపల్లి గూడూరు దళిత కాలనీకి చెందిన ఆమారి మల్లికార్జునకు చెందిన పూరిల్లు గ్యాస్ సిలిండర్ పేలి పూర్తిగా దగ్ధమైంది. దీంతో బాధితులు కట్టుబట్టలతో రోడ్డున పడ్డారు. స్థానికుల వివరాల మేరకు.. మంగళవారం వేకువ జామున అందరూ నిద్రిస్తున్న సమయంలో గ్యాస్ సిలిండర్ పేలి పూరింట్లో మంటలు చెలరేగి ఇల్లు కాలి బూడిదైంది. ఈ ఘటనలో కుటుంబ సభ్యులు ప్రాణాలతో బయటపడగా ఇంటిలో ఉన్న రూ.40వేల, ఐదు సవర్ల బంగారంతోపాటు రూ.3లక్షల విలువైన వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయని బాధితులు లబోదిబో మంటున్నారు. ప్రభుత్వం స్పందించి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని బాధితులు కోరారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ వీరేంద్రబాబు దగ్ధమైన పూరింటిని పరిశీలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నగరంలో బంగారు బాబు హల్‌చల్

నీ ఒళ్లు బంగారం గానూ..!



బంగారుబాబు

సాధారణంగా ఆడవారు స్వర్ణాభరణాల ప్రియులు అంటారు. కానీ, ఈ పురుష పుంగవుడు పుత్తడి ప్రేమికుడు. ఏడు వారాల నగల మాదిరిగా ఒంటి నిండా బంగారంతో మిలమిల మెరిసి పోతుంటాడు. చేతులకున్న పదివేళ్లకూ ఉంగరాలు, కడియాలు, బ్రాస్‌లెట్లు, రకరకాల గొలుసులతో నగల దుకాణం నడిచొస్తున్నట్లుగా ఉంటాడు. ఆయనే బంగారుబాబు. అసలు పేరు రజీమోన్. మంగళవారం నెల్లూరు నగరంలో హల్‌చల్ చేశాడు. వ్యాపార నిమిత్తం డీలర్లను కలిసేందుకు నగరానికి వచ్చారు. ట్రంకురోడ్డులోని కోమల విలాస్ హోటల్‌లో భోజనం చేశారు. స్థానికులతో కరచాలనం చేసి సెల్ఫీలకు పోజులిచ్చారు. ఈ సందర్భంగా బంగారుబాబును ఆంధ్రజ్యోతి పలకరించింది. తాను కేరళలో పుట్టి కర్ణాటకలో స్థిరపడ్డానని చెప్పారు. తనకు రెడ్‌ల్యాండ్ టీ తోటలు ఉన్నాయని తమ వ్యాపారం 4 రాష్ట్రాల్లో జరుగుతోందని తెలిపారు. తనకు హిందీ, ఇంగ్లీష్, కన్నడం, తమిళం, మళయాళీ భాషలు వచ్చని, తెలుగు అర్థం చేసుకుంటానని చెప్పారు. ఈసారి వచ్చేటప్పటికి తెలుగు నేర్చుకుని మాట్లాడుతానన్నారు. తన ఒంటిపై రెండున్నర కేజీల బంగారం నగలు ఉన్నాయని రానున్న మూడేళ్లలో ఆ మొత్తాన్ని ఐదు కిలోలకు పెంచడమే లక్ష్యమని తెలిపారు. తనకు దొంగల భయం లేదని, రక్షణకు ఎవరూ లేరని, అయినా స్వేచ్ఛగా తిరుగుతానని చెప్పారు. బంగారు నగలు ధరించి పాటలు పాడి, నృత్యాలు చేసే యోయో సింగర్ తనకు రోల్ మోడల్ అని, ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ఈ బంగారు నగలు ధరిస్తున్నానని తెలిపారు. నెల్లూరీయుల అభిమానం, భోజనం చాలా బాగున్నాయని బంగారు బాబు ప్రశంసించారు.

- నెల్లూరు, సాంస్కృతికం

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	132
లేయర్ లైవ్	115
స్కిన్ చికెన్	236
స్కిన్‌లెస్	260
లేయర్	195

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7217
వెండి కిలో ధర	రూ. 91,000
వెండి ఒక గ్రాము	రూ. 94.00

నేటినుంచి కోర్టు విధుల బహిష్కరణ

నెల్లూరు, (లీగల్) : అడ్వొకేట్స్ యాక్ట్ కొత్త సవరణలకు నిరసనగా నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధ, గురు, శుక్రవారాలు కోర్టు విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేయనున్నట్లు నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఉమా మహేశ్వర్ రెడ్డి, సుందరయ్య యాదవ్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. న్యాయాధికారులు, న్యాయవాదులు ఈ నిరసనకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం

కావలి టౌన్, సెప్టెంబరు 24: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు అందుకున్న పాతూరులోని మున్సిపల్ పాఠశాల గణిత ఉపాధ్యాయుడు, ఎన్‌సీసీ అధికారిగా విధులు నిర్వహిస్తున్న షేక్ మస్తాన్‌వలిని మంగళవారం పాఠశాల సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుబ్బారావు, స్కూల్ మేనేజ్ మెంట్ కమిటీ ఛైర్మన్ రమణమ్మ, సభ్యులు శ్యాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాలకొండ డిప్యూటీ కమిషనర్ బదిలీ

వలేటివారిపాలెం, సెప్టెంబరు 24 మాలకొండ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం డిప్యూటీ కమిషనర్ కే.బీ శ్రీనివాసరావును బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన స్థానంలో పెంచలకోన నరసింహస్వామి సాగర్‌బాబును నియమించారు. సాగర్‌బాబు శుక్రవారం బాధ్యతలు చేపట్టనున్నారు. శ్రీనివాసరావు నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాల కమిషనర్‌గా బదిలీ చేశారు.

సీసీ కెమెరాలు ఏర్పాటుకు విరాళాలు

కందుకూరు : పట్టణంలో సీసీ కెమెరాలు ఏర్పాటుకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు రూ.లక్ష విరాళం అందజేశారు. పట్టణ వ్యాపారులు, ఇతరవర్గాల ప్రజలు ఈ కార్యక్రమానికి తమవంతు చేయూత నివ్వాలన్న పిలుపుతో మంగళవారం పులువురు విరాళాలు అందజేశారు. వారిలో వీపీజీ జ్యూయలర్స్ సుకుమార్ రూ.50వేలు, కాకుమాని ప్రవీణ్ రూ.25వేలు, చీదెళ్ల శ్రీను అండ్ బ్రదర్స్ రూ.10వేలు, ఆరికట్ల ప్రసాద్ రూ.10వేలు, నూకల సుబ్బారావు రూ.10వేలను ఎమ్మెల్యేకు అందజేశారు.

గుడ్లూరు రోడ్డు వద్ద ఓవర్‌బ్రిడ్జి నిర్మించాలి

కందుకూరు, సెప్టెంబరు 24: జాతీయ రహదారిలో భాగంగా గుడ్లూరు రోడ్డు క్రాసింగ్ వద్ద ఓవర్‌బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పోకూరి మాలకొండయ్య డిమాండ్ చేశారు. మంగళవారం వారు కందుకూరు సీపీఐ సమితి సభ్యుల ఆధ్వర్యంలో జాతీయ రహదారి పనులను పరిశీలించి మాట్లాడారు. కొండముడుసుపాలెం సమీపంలో గుడ్లూరు రోడ్డు క్రాసింగ్‌లో ఓవర్‌బ్రిడ్జి లేకుండా పనులు చేస్తుండటంపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్‌బాబు, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి ఆనంద్‌మోహన్, షేక్ హుసేన్, గౌడపేరు రాము, హరిబాబు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆలయ భూముల కౌలుకు బహిరంగ వేలం

బిట్రగుంట, సెప్టెంబరు 24: కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ భూముల కౌలుకు ఈ నెల 30న నూతన కార్యాలయంలలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో రాధాకృష్ణ తెలిపారు. మూడేళ్ల పాటు కాల వ్యవధి ఉంటుందన్నారు. వేలంలో పాల్గొనే వారు దేవాదయ శాఖ నిర్ణయించిన షరతులు, నియమాలకు తెలుసుకుని పాల్గొనాలన్నారు.

కందుకూరు నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

కందుకూరు, సెప్టెంబరు 24: నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పార్టీలకు అతీతంగా కందుకూరు అభివృద్ధి మండలి పనిచేస్తుందని మాజీఎమ్మెల్యే దివి శివరాం, వివిధ ప్రజాసంఘాల నాయకులు తెలిపారు. మంగళవారం సాయంత్రం పట్టణంలోని వెంగమాంబ ఫంక్షన్‌హాలులో నియోజకవర్గ అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు, మాజీప్రజాప్రతినిధులు పాల్గొని అభివృద్ధి, ప్రజా సమస్యలపై అంశాలపై చర్చించారు. ప్రధాన సమస్యలుగా రాళ్లపాడు రిజర్వాయరు అభివృద్ధి, ప్రాజెక్టు పరిధిలోని గ్రామాల రైతులు, సాగు, తాగునీరు సరఫరా అవుతున్న గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడారు. గత అనుభవాల దృష్ట్యా ఈ మండలి నిర్మాణాత్మక పాత్ర పోషించేలా మేథావుల అభిప్రాయాలను కూడా పరిగణలోకి తీసుకుని పనిచేయాలని తీర్మానించారు. అక్టోబరు 14న తిరిగి అభివృద్ధి మండలి సమావేశాన్ని విస్తృతస్థాయిలో నిర్వహించాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. సమావేశంలో టీడీపీ, వైసీపీ, సీపీఐ, కాంగ్రెస్ పార్టీలతో పాటు వివిధ ప్రజాసంఘాలకు చెందిన నేతలు మహేశ్వరరావు, మాలకొండయ్య, కాకుమాని మాధవరావు, పాలేటి కోటేశ్వరరావు, షేక్ రఫీ, ముప్పవరపు కిషోర్, నరేష్, పొడపాటి శ్రీను, మల్లికార్జునరావు, అయ్యన్న, తోకల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావం

బిట్రగుంట : కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లను మంగళవారం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి అళహరి సుధాకర్ మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ ఈవో రాధాకృష్ణ, అర్చకులు సత్యనారాణాచార్యులు ఆయను మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ప్రత్యేక పూజాభిషేకాల అనంతరం సుధాకర్ మాట్లాడుతూ రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావం తెలుపుతు జనసైనికులతో కలసి దీక్ష చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తిరుమతశెట్టి వెంకటేష్, ప్రధాన కార్యదర్శి గంగపట్ల సురేష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

గుడ్లూరు, సెప్టెంబరు 24: ఎలాంటి అనుమతులు లేకుండా లింగసముద్రం మండలం పెదపవని ఉప్పుటేరు వాగు ఇసుకను అక్రమంగా ఇతర మండలాలకు తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను మంగళవారం తెల్లవారు జామున గుడ్లూరు పోలీసులు నరసాపురం రహదారిపై గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించారు. ముగ్గురు డ్రైవర్లనుని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకట్రావు తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

కావలి రూరల్, సెప్టెంబరు 24: రుద్రకోట వడ్డిపాలెంలోని పేకాట స్థావరంపై మంగళవారం ఎస్ఐలు బాజీబాబు, బాలక్రిష్ణలు దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న 5గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ.4,300 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సీఐ రాజేశ్వరరావు ఆదేశాల మేరకు ఈ దాడులు చేపట్టామన్నారు.

ఆర్డీవో ఆకస్మిక తనిఖీ

అల్లూరు, సెప్టెంబరు 24 : తహసీల్దారు కార్యాలయాన్ని మంగళవారం కావలి ఆర్డీవో శీనానాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సామాజిక తనిఖీల్లో భాగంగా అల్లూరుకు రికార్డులను పరిశీలించానన్నారు. భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించమని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో తహసీల్దారు లక్ష్మీ నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.


ఈ పంపుసెట్‌ను సద్వినియోగం చేసుకోరూ..!



సంగం మండలం పల్లిపాళెంలో గత టీడీపీ హయాంలో గ్రామస్థుల తాగునీటి కోసం రూ. 7.5 లక్షలతో సోలార్ పంప్ సెట్ ఏర్పాటు చేశారు. అనంతరం వైసీపీ హయాంలో ఇది మరమ్మతులకు గురైంది. అయితే ఎవరూ పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో జల్‌జీవన్ మిషన్ మంజూరు కావడంతో పైపులైన్లు, కుళాయిలు వేశారు. దీంతో సోలార్ పంప్‌సెట్ నిరుపయోగంగా మారింది. ఏదైనా ఇతర అవసరాలకు దీన్ని వినియోగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

- సంగం

వీధి లైటు వెలిగితేనేం.. బిల్లు మేం కడతామా?



వలేటివారిపాలెం మండలం అంకభూపాలపురంలో వీధిలైట్ల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా లైట్లు వెలుగుతూనే ఉంటాయి. వీటి బిల్లుల భారం పంచాయతీపై పడుతోంది. వాటి కరెంట్ బిల్లులు మేము కడతామా వెలగని అన్న చందంగా స్థానికులు వాటిని చూస్తూ ముందుకు వెళుతున్నారు. సంబంధిత పంచాయతీ అధికారులు వీటిని పట్టించుకోవడం లేదు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి అనీల్‌ను వివరణ కోరగా థర్డ్ వైరు లేకనే రాత్రిపగుళ్లు వెలుగుతున్నాయని, థర్డ్ వైరుకు పంచాయతీ నుంచి నగదు విద్యుత్ అధికారులకు చెల్లించినా థర్డ్ వైరు రాలేదన్నారు.

-వలేటివారిపాలెం

ఎస్టీ కాలనీకి తాగునీటి వసతి

అనంతసాగరం, సెప్టెంబరు 24: స్థానిక ఎస్టీ కాలనీలో తాగునీటి వసతి లేక ఇబ్బంది పడుతుండగా, ఎన్‌డీసీసీబీ మాజీ ఛైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి చేయూతనందించారు. సొంత నిధులతో మంగళవారం తన అనుచరులతో మినరల్ వాటర్ పంపిణీకు చర్యలు చేపట్టారు. దీంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు మెట్టుకూరు కృష్ణారెడ్డి, ఎంపీడీవో మధుసూదన్‌రావు, ఎంపీటీసీ రాపూరు సుజాతమ్మ, రాపూరు సుబ్బారెడ్డి దతితరులు పాల్గొన్నారు.

టపాసుల గోదాము పరిశీలన

వింజమూరు, సెప్టెంబరు 24 : కలిగిరి సీఐ వెంకట రమణ, వింజమూరు ఎస్ఐ వీరప్రతాప్ మంగళవారం పట్టణంలోని టపాసుల గోదామును పరిశీలించారు. గోదాములో టపాకాయల రక్షణకు సౌకర్యాలు ఉన్నాయా.. లేవా? పరిశీలించారు. గోదాము నిర్వాహకుడికి లైసెన్సు ఉందా.. లేదా అని అడిగి తెలుసుకున్నారు. టపాకాయల అమ్మకం రోజున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వారు ఆదేశించారు.

తక్కెళ్లపాడులో వైద్య శిబిరం

వింజమూరు, సెప్టెంబరు 24: మండలంలోని తక్కెళ్లపాడులో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా గ్రామాల్లో విషజ్వరాలు వ్యాపించకుండా వైద్య సిబ్బంది ఈ శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామస్థులకు బీపీ చెకప్ చేసి, జ్వరాలు ఉన్నవారికి మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ శివరాణి, పంచాయతీ కార్యదర్శి పెంచలయ్య, మాజీ ఎంపీటీసీ రొడ్డా కొండయ్య, టీడీపీ నేత పెద్దయ్య, ఆశా కార్యకర్తలు నయోమి, అమ్ములు, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలకు పాదయాత్ర



సంగం, సెప్టెంబరు 24: మండలంలోని మర్రిపాడుకి చెందిన కొంతమంది యువకులు, పెద్దలు పాదయాత్రగా మంగళవారం తిరుమలకు బయలుదేరి వెళ్లారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలతో గ్రామస్థులు సుభిక్షంగా ఉండాలని ఆ ఏడుకొండలస్వామికి వేడుకొంటూ పదేళ్లుగా పాదయాత్ర చేస్తున్నారు. అందులో భాగంగా సుమారు 50 మంది గ్రామస్థులు యాత్ర చేపట్టారు. ఉదయం 10 గంటలకు సంగం చేరుకున్నారు. పొదలకూరు, రాపూరు, వెంకటగిరి, ఏర్పేడు మీదుగా తిరుమలకు చేరుకుంటారు.

బాణసంచా దుకాణాలకు అనుమతులు తప్పనిసరి

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 24: దీపావళి సందర్భంగా బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసేవారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఎస్ఐలు కర్నాటి ఇంద్రసేనారెడ్డి, శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని రెండు బాణసంచా గోదాములు, విక్రయ, తయారు చేసే కేంద్రాలను తనిఖీ చేసి లైసెన్సులు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ అనుమతుల్లేకుండా బాణసంచా విక్రయించినా, నిల్వ ఉంచినా చర్యలు తప్పవన్నారు.

దుత్తలూరు : మండలంలోని వెంకటంపేటలోని బాణసంచా తయారీ, విక్రయ కేంద్రాన్ని మంగళవారం ఎస్ఐ ఆదిలక్ష్మి తన సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్ర రికార్డులు, లైసెన్సును పరిశీలించారు.

కళాశాలలో పరిశుభ్రత కార్యక్రమాలు

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 24: స్థానిక మేకపాటి గౌతంరెడ్డి వ్యవసాయ ప్రభుత్వ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సేవాభావం, క్రమశిక్షణ అలవర్చుకొని సమాజంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం కళాశాల ఆవరణలో చెత్తాచెదారాన్ని ఏరివేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు గోపికృష్ణ, కిషన్‌తేజ, శోభ, మాధవి, రాజేశ్వరి, అశోక్, సూర్య పాల్గొన్నారు.

లోక కల్యాణార్థం యాగాలు

సంగం, సెప్టెంబరు 24: ఋషులు లోక కల్యాణార్థం యాగాలు, కుంభాభిషేకాలు నిర్వహిస్తుంటారని తమిళనాడులోని వారాహి శక్తిపీఠం పీఠాధిపతి యాగరుషి వారాహి గురుజీ పేర్కొన్నారు. మంగళవారం ఆయన సంగం తిరుమనకొండలోని శ్రీరాజరాజేశ్వరిదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన స్వామి,అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తరువాత హోమం నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. అనంతరం భక్తులకు ఉపదేశించారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

ఆత్మకూరు, సెప్టెంబరు 24 : మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల మృతి చెందిన ఐదుగురికి (ఒక్కొక్కరికి రూ.10,000 వంతున) రూ. 50వేలను సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు మంగళవారం అందజేశారు. 4వ వార్డులోని షేక్ ఖాదర్‌బాషా, 8వ వార్డులో శీలా సుభద్రదేవి, 18 వార్డులోని మల్లె చిన్నమ్మ, చెలమచర్ల వెంకటయ్య, 22వ వార్డు పరిధిలోని డక్కా పోలమ్మ కుటుంబాలను వారు పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, శేషారెడ్డి, ట్రస్ట్ సభ్యులు రాంపల్లి ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● **జలదంకి :** లక్ష్మీపురం సమీపంలో ట్రాక్టర్ ప్రమాదంలో మృతిచెందిన కోదండరామాపురం వీఆర్ఏలు వంకదారి మాల్యాద్రి, వడ్డే శ్రీనివాసులు కుటుంబాలను మంగళవారం తహసీల్దార్ హేమంత్‌కుమార్ పరామర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున తక్షణసాయంగా ఒక్కో కుటుంబానికి రూ.10వేలు అందజేశారు. మృతుల కుటుంబాల్లో అర్హులైన వారుంటే వారికి వీఆర్ఏ ఉద్యోగం ప్రభుత్వం ఇవ్వనుందని చెప్పారు. కార్యక్రమంలో డీటీ భరత్, ఆర్ఐ శ్రీనివాసులు, వీఆర్వో బాలకోటయ్య పాల్గొన్నారు.

విద్యార్థినులకు అవగాహన

సంగం, సెప్టెంబరు 24: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు సీఐ వేమారెడ్డి గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ఇతర చట్టాలపై మంగళవారం అవగాహన కల్పించారు. పాఠశాలలో రెండు రోజుల కిందట గుర్తుతెలియని ఆకతాయిలు టాయిలెంట్ సింక్‌లను ధ్వంసం చేయడంపై హెచ్‌ఎం బుజ్జయ్య సీఐకి వివరించారు. పాఠశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్య తీసుకోవాలి

కావలి, సెప్టెంబరు24: తిరుమల లడ్డూను అపవిత్రం చేసిన అప్పటి టీటీడీ ఛైర్మన్లు, ఈవోలపై చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ సీవీసీ సత్యం, పట్టణ అధ్యక్షుడు బ్రహ్మానందంలు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక జర్నలిస్ట్‌క్లబ్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. శ్రీవారి భక్తులను మనోభావాలను దెబ్బతిసిన వారిపై విజిలెన్స్ విచారణ జరిపించాలన్నారు. సమావేశంలో పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి మందా కిరణ్, ఉపాధ్యక్షుడు సుందరశెట్టి సుజిత్, నేతలు వెంకటరెడ్డి, రాకేష్, ప్రసన్న పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో నిరసన సబబు కాదు : సీఐ

కలిగిరి, సెప్టెంబరు 24: రావులకొల్లు ఆశావర్కర్ పందిటి విజయమ్మను విధుల నుండి తప్పించడంతో ఆశావర్కర్లతో పాటు సీఐటీయూ, ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌ఎఫ్ నాయకులు మూడురోజులుగా స్థానిక పీహెచ్‌సీలో నిరసనలు చేపట్టడం సబబు కాదని కలిగిరి సీఐ వెంకట నారాయణ అన్నారు. మంగళవారం ఆయన ఎస్ఐ ఉమాశంకర్‌లు తమ సిబ్బందితో కలిసి పీహెచ్‌సీ వద్దకు వెళ్లి యూనియన్ నాయకులు, ఆశా వర్కర్లతో చర్చలు జరిపారు. అనంతరం స్థానిక వైద్యాధికారి, డీఎంహెచ్‌ఓలతో ఫోన్లో మాట్లాడారు.

పంటకాలువకు గండి

కొండాపురం, సెప్టెంబరు 24: మోపాడు రిజర్వాయరు నుండి మండలానికి వచ్చే కాలువకు గండి పడటంతో నీరు మన్నేరు వాగులోకి చేరుతుంది. గండి విషయంపై రిజర్వాయరు ఏఈ శ్రీనివాసులును వివరణ కోరగా ఎవ్వరో గుర్తుతెలియని వ్యక్తులు కాలువకు గండి కొట్టారని ఈ విషయంపై ఉన్నతాధికారులు ఫిర్యాదు చేస్తామన్నారు. మరమ్మతులకు ప్రతిపాదనలు పంపుతామన్నారు.

పాముకాటుతో వ్యక్తి మృతిపై విచారణ

బిట్రగుంట, సెప్టెంబరు 24: అల్లిమడుగు సంఘానికి చెందిన బీ శంకర్ ఈనెల 2వ రాత్రి పాముకాటుతో మృతి చెందాడు. కోవూరుపల్లి పీహెచ్‌సీలో చికిత్స అందక పోవండం వల్లే శంకర్ మృతి చెందాడని వస్తున్న వార్తలకు జిల్లా అధికారులు స్పందించారు. వారి ఆదేశాల మేరకు డిప్యూటీ డీఎంహెచ్‌వో బ్రిజిత మంగళవారం గ్రామంలో విచారణ చేపట్టారు.

27న జాబ్‌మేళా

ఉదయగిరి రూరల్ : ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయింట్ ఆఫీస్, సీడాస్ సంయుక్త ఆధ్వర్యంలో 27న స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఏ.నరసింహులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

వరద బాధితులకు విరాళం



ఉదయగిరి రూరల్ : కరస్పాండెంట్ సుధాకర్‌కు నగదు అందజేస్తున్న ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి



కావలి : ఎంఈవోలకు డీడీ అందజేస్తున్న విద్యార్థులు



ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 24: విజయవాడ వరద బాధితుల కోసం స్థానిక హోలీఏంజల్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, యాజమాన్యం రూ.1.10 లక్షల విరాళాలను సేకరించింది. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి, ఆ నగదును కరస్పాండెంట్ సుధాకర్, హెచ్‌ఎం కరుణకుమారికి అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కావలి రూరల్ : మన్నంగిదిన్నె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు గ్రామస్థుల సహకారంతో వరద బాధితుల సహాయార్థం రూ.8వేలు సేకరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఏవీ రత్నం, సీఆర్పీ హేమామాలిని పాల్గొన్నారు.

వాటర్ డిస్పెన్సర్ వితరణ

కావలి రూరల్, సెప్టెంబరు24: చలంచర్ల పంచాయతీలోని పెద్దవరం పాఠశాలకు విశాఖపట్నంకు చెందిన వ్యాపారవేత్త ఇరువూరి మాల్యాద్రి వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం మంగళవారం వాటర్ డిస్పెన్సర్‌ను వితరణగా అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు బి.గోవిందయ్య, సిహెచ్. వెంకట సుబ్బయ్య, విద్యాకమిటీ ఛైర్మన్ మహేంద్ర, హెచ్‌ఎం మధుసూధన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి

ఆత్మకూరు, సెప్టెంబరు 24: పంటల సాగులో విచక్షణారహితంగా పురుగు మందులు వాడకం తగదని, సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించడం లాభదాయకమని మండల వ్యవసాయశాఖాధికారి కిషోర్‌బాబు తెలిపారు. మంగళవారం మండలంలోని కరటంపాడు, బీ చిరువెళ్ల గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కరటంపాడు పశువైద్యశాల డాక్టర్ కృష్ణయ్య, ఏపీసీఎన్‌పీ సిబ్బంది, వీపీఏడబ్ల్యూవోలు పాల్గొన్నారు

కందుకూరు: పలుకూరు, మహదేవపురం గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి రాము ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి ఏవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త వెంకటేష్, ప్రకృతి వ్యవసాయం అధికారిణి సునీత, కేవీకే శాస్త్రవేత్త వివేక్, కామత్, డ్వామా ఏపీడీ బాబూరావు, ఉద్యాన శాఖ అధికారి బ్రహ్మసాయి, మార్కెటింగ్ శాఖ అధికారి ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్ : పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని గండిపాళెం, గుడినరవ గ్రామాల్లో సాగులో ఉన్న పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఆంజనేయులనాయక్, పంచాయతీ కార్యదర్శి అమర్నాథ్‌రెడ్డి, ఏఈవో రాజశేఖర్‌రెడ్డి, వీపీఏ ఫయాజ్, అనుబంధ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దుత్తలూరు : గ్రామంలోని 12 సచివాలయాల పరిధిలో మంగళవారం మండల వ్యవసాయాధికారి వెంకటసుబ్బారెడ్డి పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. బొప్పాయి పంటను పరిశీలించి రైతుకు సలహాలిచ్చారు.

ఏఎస్‌పేట : మండలంలోని అనుమసముద్రం, చందులూరుపాడు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి రజిని, ఉద్యానవన అధికారిణి పీ లక్ష్మి,ఏఈవో కే చిరంజీవి,వీపీఏలు జీ రమ్య,వై భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీతారామపురం : మండలంలోని పబ్బులేటిపల్లి, చిన్ననాగంపల్లి గ్రామాల్లో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయాధికారి పీ చెన్నారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పొదలకూరు వ్యవసాయం శాస్త్రవేత్త డాక్టర్ సురేఖాదేవి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పబ్బులేటిపల్లిలో సాగులో ఉన్న వరి, పత్తి పైర్లను, చిన్ననాగంపల్లిలో మొక్కజొన్న పంటను పరిశీలించారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ మాలశ్రీ,ఏఎంసీ యార్డ్ అసిస్టెంట్ చిరంజీవి, వీపీఏ కవిత, తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఆర్ పురం : పత్తి పంటను పరిశీలిస్తున్న డాక్టర్ సురేఖాదేవి,వ్యవసాయాధికారి చెన్నారెడ్డి తదితరులు

వరికుంటపాడు : మండలంలోని విరువూరు, పెద్దిరెడ్డిపల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సదస్సులో రైతులకు మండల టీడీపీ కన్వీనర్ చంద్ర మధుసూదన్‌రావు విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రావెళ్ల నాగేంద్ర, వైస్ ఎంపీపీ మధు, సర్పంచి మహేష్, ఉద్యానశాఖాధికారి జయశ్రీ, వీపీఏలు పాల్గొన్నారు.

లింగసముద్రం : పెదపవని, ముత్యాలపాడు రైతుసేవా కేంద్రాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు గొర్రెపాటి సాంబయ్య, రామిశెట్టి మాలకొండయ్య, పాల్గొన్నారు.

కొండాపురం: వ్యవసాయశాఖ ద్వారా వచ్చే పథకాలపై రైతులు అవగాహన పెంచుకోవాలని వ్యవసాయశాఖ అధికారి చంద్రభాను తెలిపారు. గానుగపెంట, తూర్పుఎర్రబల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని రైతులకు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏఈవో ఈశ్వరాచారి, వీపీఏ రవి, చంద్రశేధర్ పాల్గొన్నారు.

అభివృద్ధిలో కావలిని ప్రథమస్థానంలో నిలబెడతా : ఎమ్మెల్యే

కావలి, సెప్టెంబరు 24: సీఎం చంద్రబాబు పాలనలో కావలి నియోజకవర్గాన్ని అభివృద్ధిలో రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలుపుతానని ఎమ్మెల్యే డీవీ క్రిష్ణారెడ్డి తెలిపారు. పట్టణ 13వ వార్డులో మంగళవారం సాయంత్రం కూటమి ప్రభుత్వ 100 రోజుల పాలనలో సాధించిన విజయాలను ఎమ్మెల్యే ఇంటింటికి వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. నియోజకవర్గాన్ని గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. కావలిని గంజాయి హబ్‌గా మార్చారని మండిపడ్డారు ఇప్పటికే రోడ్ల అభివృద్ధిపై దృష్టి సారించామన్నారు. తీర ప్రాంతంలో పరిశ్రమలకు అవసరమైన భూసేకరణ, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్, రామాయపట్నం పోర్టు నిర్మాణాలు పూర్తి కావస్తున్నట్లు చెప్పారు. మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య, శ్రీకాంత్‌ల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రావణ్ కుమార్, డీఈ సాయిరాం, నేతలు గుత్తికొండ కిషోర్, జ్యోతిబాబూరావు, జనసేన ఇన్‌చార్జి అళహరి సుధాకర్, పొబ్బా సాయి విఠల్, సిద్ధూ, బీజేపీ నేతలు సీవీసీ సత్యం, కే. బ్రహ్మానందం పాల్గొన్నారు.





జలదంకి: రామవరప్పాడులో కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల దంపతులు, కావలి: కరపత్రాన్ని అందచేస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

రామవరప్పాడు అభివృద్ధికి కృషి

జలదంకి : స్థానిక నాయకులు, సర్పంచి, ప్రజల సహకారంతో రామవరప్పాడు అభివృద్ధికి కృషి చేస్తామని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. ఇది మంచిప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే మంగళవారం రామవరప్పాడులో పర్యటించి వందరోజుల పాలనపై సతీమణితో కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం సర్పంచ్ ఉన్నం సరస్వతి అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో ప్రభుత్వ పాలనతీరును ఎమ్మెల్యే వివరించారు. అనంతరం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హేమంత్‌కుమార్, ఎంపీడీవో చంద్రశేఖర్, నేతలు మధురెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఉన్నం రవి, కంచర్ల రామచంద్రయ్య, వర్ధినేని మురళిపాల్గొన్నారు.



కళవళ్లలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు

వలేటివారిపాలెం: పేదలకు సంక్షేమం, అభివృద్ధి ఫలాలు అందించడమే సీఎం చంద్రబాబు ప్రధాన లక్ష్యం అని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. కళవళ్లలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, పరిటాల భాస్కర్‌రావు, స్వర్ణ చిననాంచారయ్య, మోదేపల్లి లక్ష్మీనారాయణ, మోదేపల్లి వెంకటనరసింహం, పాల్గొన్నారు.

రేపు ఇస్కపల్లిలో 'ఇది మంచి ప్రభుత్వం' ముగింపు

అల్లూరు : ఇది మంచి ప్రభుత్వం ముగింపు కార్యక్రమాన్ని ఇస్కపల్లిలో గురువారం నిర్వహించనున్నట్లు నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ తెలిపారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రలు పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో పీ శ్రీనివాసులురెడ్డి, బండి శ్రీనివాసులు రెడ్డి, తోట శ్రీహరి, బిట్రగుంట చైతన్య, కృష్ణ చైతన్య, ఊటు శ్రీకాంత్, బిట్రగుంట వెంకటేశ్వర్లురెడ్డి పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

లింగసముద్రం : అన్నెబోయినపల్లి గ్రామ సమీపంలోని మన్నేరు వాగులో నుంచి అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను లింగసముద్రం పోలీసులు పట్టుకున్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు మంగళవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఇసుక నింపుకుంటున్న మూడు ట్రాక్టర్లను గ్రామ శివారులో ఎస్ఐ షేక్ మహబూబ్ సుబానీ, సిబ్బందితో దాడి చేసి మూడు ట్రాక్టర్లను, డ్రైవర్లను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ముగ్గురు డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

టపాసుల గోదాము తనిఖీ : జలదంకి : జమ్మలపాలెంలోని టపాసుల గోడౌన్‌ను మంగళవారం సాయంత్రం కలిగిరి సీఐ వెంకటనారాయణ తనిఖీ చేశారు. నిబంధనల ప్రకారం అగ్నిప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యల కోసం ఏర్పాటు చేసిన పరికరాలను పరిశీలించారు.


నేటి సమావేశాన్ని విజయవంతం చేయాలి

సైదాపురం, సెప్టెంబరు 24: గుంటూరులోని అరండల్‌పేటలో బుధవారం జరగనున్న ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు బీ మమత కోరారు. మంగళవారం స్థానిక అఖిల భారత రైతు కూలీ సంఘం కార్యాలయంలో ఆమె కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకురాళ్లు గడ్డం రమణమ్మ, శ్రావణి, ముత్యాలమ్మ, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

బీసీ కాలనీలో వైద్యశిబిరం

మనుబోలు, సెప్టెంబరు 24: జనసేన ఆధ్వర్యంలో స్థానిక బీసీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఇటీవల బీసీ కాలనీలో గణేష్ ఉత్సవాల్లో బాణాసంచా పేలుళ్లు జరిగి చాలా మంది గాయపడ్డారు. వీరిని దృష్టిలో ఉంచుకుని మండల జనసేన అధ్యక్షుడు పెనుబాక ప్రసాద్ చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు డాక్టర్ చంద్రశేఖర్‌చే వైద్యశిబిరం ఏర్పాటు చేయించారు. ఈ శిబిరాన్ని తహసీల్దార్ సుబ్బయ్య ప్రారంభించారు. మను బోలు గీతా మెడికల్స్ అధినేత కామిశెట్టి భార్గవ్ రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్వేపల్లి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి బొబ్బేపల్లి సురేష్‌నాయుడు, మండల నాయకులు పాల్గొన్నారు.

సీఎంతో రూప్‌కుమార్ భేటీ



నెల్లూరు(సిటీ) : సీఎం చంద్రబాబు నాయుడుతో మంగళవారం నెల్లూరు నగర డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ భేటీ అయ్యారు. అమరావతిలో జరిగిన ఈ భేటీలో నెల్లూరు రాజకీయ పరిణామాలపై సీఎంతో రూప్‌కుమార్ చర్చించినట్లు సమాచారం. కార్పొరేషన్ ద్వారా చేపట్టబోయే పలు నూతన అంశాలు, నిధులు తదితర విషయాలు ఇరువురి మధ్య చర్చకొచ్చినట్లు విశ్వసనీయ సమాచారం.



● పాడి రైతులకు ఆర్థిక భరోసా

'గోకులం'లో షెడ్ల నిర్మాణానికి ఊతం

పొదలకూరు, సెప్టెంబరు 24 : పాడి రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కొద్దిపాటి పొలం, షెడ్లు వేసేందుకనేందుకు స్థలం ఉంటే పాడిరైతులకు రాష్ట్ర ప్రభుత్వం గోకులం పేరుతో ప్రత్యేక ఈ పథకాన్ని అమలు చేస్తున్నది. గత టీడీపీ ప్రభుత్వంలో ఎంతోమందికి ఉపయోగ పడిన ఈ పథకం ఐదేళ్ల వైసీపీ పాలనలో నిర్లక్ష్యానికి గురైంది. రాష్ట్రంలో మళ్లీ కూటమి ప్రభుత్వం రావడం తో గోకులం పథకం కింద మళ్లీ లబ్ధిదారుల ఎంపిక ప్రారంభమైంది. మండలానికి 15 యూనిట్లు మంజూరు చేశారు. ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డు ఉన్న చిన్న, సన్నకారు రైతులు పథకానికి అర్హులని అధికారులు తెలిపారు. దరఖాస్తులు రైతు సేవా కేంద్రం, మండల వ్యవసాయశాఖ కార్యాల యం, పశు వైద్యశాలల్లో అందుబాటులో ఉన్నాయ న్నారు. పూర్తి చేసిన దరఖాస్తుతోపాటు ఆధార్‌కార్డు, జాబ్‌కార్డు, షెడ్ల నిర్మాణా లకు సంబంధించిన భూమి రిజిస్ట్రేషన్ పత్రాలు, బ్యాంకు పాసు పుస్తకం నకలు సమర్పించాలని అధికారులు పేర్కొ న్నారు. పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకందారులకు ఈ అవకాశం కల్పించింది. ఇందులో పశువుల పెంపకందారుల షెడ్ల నిర్మాణానికి 90 శాతం, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకదా రుల షెడ్ల నిర్మాణానికి 70 శాతం రాయితీ ఇవ్వనున్నారు.

షెడ్ల నిర్మాణాలకు నిధుల మంజూరు ఇలా..

షెడ్డు పరిధి (రూ.లలో)	యూనిట్ విలువ (రూ.లలో)	రాయితీ చెల్లించాల్సింది	రైతు రూ.లలో
2 పశువులు	1,15,000	1,03,500	11,500
4 పశువులు	1,85,000	1,66,500	18,500
6కంటే ఎక్కువ	2,30,000	2,07,500	23,000
20 గొర్రెలు, మేకలు	1,30,000	91,000	39,000
50 గొర్రెలు, మేకలు	2,30,000	1,61,000	69,000
100 కోళ్లు	87,000	60,900	26,100
200పైబడి ఉంటే	1,32,000	92,000	39,600

అవకాశాన్ని వినియోగించుకోండి

మండలానికి 15 యూనిట్లు లక్ష్యంగా గోకులం పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్నది. అర్హులైన పాడి రైతులు వెంటనే దరఖాస్తు చేసుకో వాలి. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి.

- అరుణ, పశుసంవర్ధక శాఖ, ఏడీ, పొదలకూరు

పాలన బాగుందని ప్రజలే అంటున్నారు

● 'ఇది మంచి ప్రభుత్వం' మంత్రి నారాయణ



స్థానికులకు కరపత్రాలను పంచుతున్న మంత్రి నారాయణ

నెల్లూరు (వ్యవ సాయం), సెప్టెంబరు 24 : ముఖ్యమంత్రి చంద్రబాబు తన విజన్‌తో 100 రోజుల్లోనే మంచి పరిపాలన అందించారని ప్రజలే గొప్పగా చెప్పడం సంతోషంగా ఉందని రాష్ట్ర పురపాలక, పట్టణాభి వృద్ధిశాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. నగరంలోని 48వ డివిజన్ ఉయ్యాలకాలువ కట్ట తదితర ప్రాంతాల్లో మంగళవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ఏడాదికి రూ.250 లెక్కన పింఛను పెంచారని, కానీ చంద్రబాబు ఇచ్చిన మాట తప్పకుండా రూ.వెయ్యి ఒకేసారి పెంచి రూ.4వేలు ఇస్తున్నారని, దివ్యాంగులకు ఏకంగా రూ.6వేలు ఇస్తున్నామని చెప్పారు. ఇంకా ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. త్వరలోనే ఉయ్యాల కాలువకట్టకు రెండు పక్కల రివిట్‌మెంట్ ఏర్పాటు చేసి స్లాబ్ వేయిస్తానని చెప్పారు. ఇక్కడి సమస్యలన్నీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ మంత్రి నారాయణ నెల్లూరులో ఉండడం అదృష్టమని, నిత్యం ప్రజా సమస్యలపై ఆయన పోరాటం చేస్తుంటారని కొనియాడారు.

పాఠశాలల్లో బీటీఏ సభ్యత్వ నమోదు

నెల్లూరు (విద్య), సెప్టెంబరు 24 : బహుజన టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరు రూరల్ పరి ధిలోని స్కూల్ కాంప్లెక్సులలో మంగళవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. సంఘం జిల్లా కార్య దర్శి మాసా ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు, నిర్వహణ నిధులతోపాటు ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలను చెల్లించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు హనీఫ్‌బాబు, సంపత్, హరి, రవికుమార్ పాల్గొన్నారు.



పారిశుధ్య పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

పరిసరాల పరిశుభ్రత సామాజిక బాధ్యత: ఎమ్మెల్యే

కోవూరు, సెప్టెంబరు 24 : పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా స్వీకరించాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సూచించారు. కోవూరు బజారు కూడలిలో మంగళవారం స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పారిశుధ్య నిర్వహణపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. డస్ట్ బిన్స్‌లో వేయాల్సిన చెత్తాచెదారం, చెడిపోయిన ఆహార పదార్థాలు వీధుల్లో పడేయడం అలవాటుగా మార్చుకుని అపరిశుభ్రత సృష్టిస్తున్నారన్నారు. ఇంటిని ఎలా శుభ్రం చేసుకుంటామో గ్రామాన్ని కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సహకారంతో వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా తాము తలపెట్టిన క్లీన్ కోవూరు సాకారం దిశగా అడుగులు వేస్తామ న్నారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత స్థానిక సంస్థలకు 15వ ఆర్థిక సంఘ నిధులను మంజూరు చేశారన్నారు. అనంతరం ఆమె చీపుర పట్టి వీధులు శుభ్రం చేశారు. కార్యక్రమలో ఎంపీపీ పార్వతి, ఎంపీడీవో శ్రీహరి, సర్పంచు యాకసిరి విజయమ్మ, నాయకులు ఇంతా మల్లారెడ్డి, గాదిరాజు అశోక్, జెట్టి రాజగోపాల్‌రెడ్డి, జెట్టి మదన్‌మోహన్, చప్పిడి శ్రీనివాసులురెడి పాల్గొన్నారు.

● సమపాళ్లలో సంక్షేమం, అభివృద్ధి : ఎమ్మెల్యే

బుచ్చిరెడ్డిపాళెం : రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నా ప్రజలకు సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో అందిస్తున్న సమర్థవంతమైన నాయకుడు నారా చంద్రబాబునాయుడు అని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. మంగళవారం 14, 17వార్డులలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డిలతో కలిసి ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా మహాలక్ష్మమ్మను, కళ్యాణ వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అంటించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు వైష్ణవి, ప్రసాద్, కూటమి నాయకులు కొండయ్య, సింగంశెట్టి కిషోర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

టీడీపీ లీగల్ సెల్ హర్షం

నెల్లూరు (లీగల్), సెప్టెంబర్ 24 : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జూనియర్ న్యాయవాదులకు నెలకు 10వేల రూపాయలు స్టైఫండ్ ప్రకటించడంపై టీడీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మంగళవారం హర్షం ప్రకటించారు. ఈ కార్య క్రమంలో టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు షేక్ రియాజ్ బాషా, సెక్రటరీ రమేష్, సీనియర్ న్యాయవాది షేక్ నన్నే సాహెబ్, రూరల్ ప్రెసిడెంట్ షేక్ అన్వర్ బాషా పాల్గొన్నారు.

నిరుపేదలకు ఆహార పొట్లాల పంపిణీ

నెల్లూరు(వైద్యం) : నగరంలోని పెన్నా ఆనకట్ట అనుకుని నివసిస్తున్న నిరుపేదలకు టీడీపీ బీసీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు మంగళవారం ఆహార పొట్లాలు అందచేశారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 47వ డివిజన్‌లో ఇంటింటికి తిరిగారు. టీడీపీ వంద రోజుల పాలన అద్భుతంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు చంద్ర, లవకుమార్, రాజేష్, గణేష్, భాస్కర్, రత్నం తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి పీహెచ్‌డీ ప్రదానం




పీహెచ్‌డీ పట్టా అందుకున్న డాక్టర్ తిరుమల స్వాతి, డాక్టర్ బీవీఎస్ గౌతమ్

వెంకటాచలం, సెప్టెంబరు 24 : మద్రాసు యూనివర్శిటీలో మంగళవారం జరిగిన 166వ స్నాతకోత్సవంలో ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు మడభూషి సంపత్ కుమార్ రచించిన కవిత్వంపై పరిశోధన చేసిన ఇద్దరు పరిశోధకులు పీహెచ్‌డీ పట్టాలు అందుకు న్నారు. నెల్లూరు నగరానికి చెందిన పరిశోధన విద్యార్థిని డాక్టర్ డీ తిరుమలస్వాతి 'మడ భూషి కవిత్వానుశీలన' పరిశోధనను డాక్టర్ ఎం.మురళీ పర్యవేక్షణలో సమర్పిం చారు. అలాగే పరిశోధన విద్యార్థి డాక్టర్ బీవీఎస్ గౌతమ్ 'సంపత్ కుమార్ కవిత్వం - సామాజిక చిత్రణ' అనే అంశంపై మద్రాసు యూనివ ర్సిటీ కళాశాల తెలుగు శాఖాధ్యక్షుడు డాక్టర్ ఎస్ యజ్ఞశేఖర్ పర్యవేక్షణలో పరిశోధన సమర్పించారు. దీంతో వీరు పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. తాను చేసిన కవిత్వాలపై పరిశోధనలు చేసి నెల్లూరు వాసులు పీహెచ్‌డీ పట్టాలు అందుకోవడం ఎంతో సంతోషంగా ఉందని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సం చాలకులు మడభూషి సంపత్‌కుమార్ తెలిపారు.

8.50 లక్షల ఎకరాలకు సోమశిల, కండలేరు జలాలు

● సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలు పంపిణీ చేస్తున్న సోమిరెడ్డి

పొదలకూరు, సెప్టెంబరు 24 : సోమశిల, కండలేరు జలాశయాల నుంచి ఈ ఏడాది 8.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని చాటగొట్లలో ఇంటిం టికి వెళ్లి కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలన లో అమలు చేసిన కార్యక్రమాలను ప్రజలకు వివరించి కరపత్రాలు పంచారు. అలాగే పోషకా హార మాసోత్సవాల్లో పాల్గొని గర్భిణులకు పౌష్టికా హారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ దేశంలో సామాజిక పింఛను రూ.4వేల ఇస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనన్నారు. నిరుద్యోగుల కోసం అధికారం చేపట్టిన వెంటనే టెట్, డీఎస్సీ ఇచ్చామన్నారు. రైతులు చేసుకున్న నీరు-చెట్టు పనులకు గత ప్రభుత్వం రూ.250 కోట్ల నిధులను ఆపేసిందన్నారు. మాజీ సీఎం జగన్‌కి గుండె లేదని అతని శరీరమంతా దుర్మార్గమైన ఆలోచనలతో నిండి ఉందని విమర్శించారు. దీపావళి నుంచి మూడు గ్యాస్ సిలిండర్‌లు అందిస్తామన్నారు. ఎంపీ విజయసాయిరెడ్డి, కాకాణి లాంటి వాళ్ల ముఖాన జనం ఇప్పటికే ఉమ్మేస్తున్నారన్నారు. అలాగే పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించా మన్నారు. కంటైనర్ టెర్మినల్ ఎత్తేసిన ఘనత కాకాణికే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తలచీరు మస్తాన్‌బాబు, బొద్దులూరు మల్లికార్జున్‌నాయుడు, కలిచేటి ప్రభాకర్‌రెడ్డి, కండే సురేష్‌యాదవ్, పచ్చిపాల అయ్యప్ప, జీవీఆర్, పులిపాటి వెంకటరత్నంనాయుడు, అక్కెం సుధాకర్‌రెడ్డి, కోడూరు పెంచలబాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే సేవా దృక్పథం ఉండాలి

● వీఎస్‌యూ వీసీ ఆచార్య విజయభాస్కర్



స్వచ్ఛత హి సేవ గురించి ప్రమాణం చేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, అధికారులు

నెల్లూరు (వెంకటేశ్వరపురం), సెప్టెంబరు 24 : విద్యార్థి దశ నుంచే సేవా దృక్పథం కలిగి ఉండాలని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్ విజయభాస్కర్ పేర్కొన్నారు. నెల్లూరు వేదాయపాళెం రైల్వేస్టేషన్‌లో మంగళవారం యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. అందరం సేవా మార్గంలో ఉంటామంటూ ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను శుభ్రపరిచారు. వీసీ మాట్లాడుతూ చిన్నతనం నుంచే సేవాభావం అలవర్చుకోవాలని, ఈ విషయంలో గురువులు, తల్లితండ్రులు విద్యార్థులకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వైద్యురాలు సునీత, రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ మునిబాబు, ఉదయశంకర్, విద్యాప్రభాకర్, సాయినాథ్ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

డీకేడబ్ల్యూ కళాశాలలో...

నెల్లూరు (విద్య): నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డీ గిరి మాట్లాడుతూ విద్యార్థులు సేవా దృక్పథాన్ని అలవరచుకోవడం ద్వారా దేశభక్తిని పెంపొందించుకోవచ్చన్నారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారని కొనియాడారు. అనంతరం విద్యార్థినులకు సాంస్కృతిక, క్రీడాపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రమణరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ వై దివ్య, డాక్టర్ మనోజ్ ప్రభాకర్, డాక్టర్ కేవీ సత్యనారాయణ, డాక్టర్ ఎస్ సురేంద్ర, డాక్టర్ టీ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమం టీడీపీతోనే సాధ్యం



మనుబోలు : నిమ్మతోట పరిశీలనలో వ్యవసాయాధికారులు

కొడవలూరు, సెప్టెంబరు 24 : రైతుల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని రామన్నపాళెంలో మంగళవారం ప్రారంభమైన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రైతులతో కలసి నాగలి పట్టి పొలం దున్ని విత్తనాలు చల్లారు. ఆమె మాట్లాడు తూ వ్యవసాయ రంగంలో ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, వ్యవసా యశాఖ ఏవో ప్రసన్న, టీడీపీ నాయకులు మూంగమూరి శ్రీహరిరెడ్డి, కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి, డేగా దయాకర్‌రెడ్డి, కేతూ వెంకటరమణా రెడ్డి, చెక్క మదన్, మందిపాటి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

● **మనుబోలు** : స్థానిక రైతుభరో సా కేంద్రంలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయాధికారి జహీర్ ప్రారంభించి గోడపత్రిక ఆవిష్కరించారు. మనుబోలులోని నిమ్మ తోట లకు వెళ్లి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక మంలో ఏఏవో కళారాణి, టీడీపీ నాయకులు పచ్చిపాల రామిరెడ్డి, రాయపాటి కిరణ్‌కుమార్, శివుడు రాజాగౌడ్, చింతల వెంకటేశ్వర్లు, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

● **ఇందుకూరుపేట** : మండలంలోని జంగందొరువు గ్రామంలో మండల వ్యవసాయ అధికారి డి.రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో భూములు, పంటలు పరిశీలించి రైతులకు ఆధునిక వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు కృషి విజ్ఞాన్ క్షేత్రం శాస్త్రవేత్త కె.కిరణ్‌కుమార్‌రెడ్డి, పశుసంవర్ధక శాఖ ఏడీ బి.మురళీకృష్ణ, మత్స్య, ఉద్యానశాఖల సిబ్బంది హేమలత, ఝాన్సీ, ఇందుకూరుపేట ఉపసర్పంచు శ్రీనివాసులు పాల్గొన్నారు.

● **తోటపల్లిగూడూరు** : మండలంలోని నరుకూరులో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏడీఏ రాజ్‌కుమార్ రసాయన, సేంద్రియ ఎరువులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శిరీష, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

● **బుచ్చిరెడ్డిపాళెం** : చెల్లాయపాళెం, కాళయకాగొల్లు గ్రామాలలో పొల పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. బంతి, కూరగాయలు, మొక్కజొన్న పంటలను అధికారులు సందర్శించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎం.సురేంద్రరెడ్డి, గ్రామాల సర్పంచులు, ఏఎంసీ సూపర్‌వైజర్ రవిచంద్ర, వీఏఏ కళ్యాణి పాల్గొన్నారు.

● **సైదాపురం** : తుమ్మల తలుపూరు, కలిచేడు గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారిణి హైమావతి, ఎంపీపీ పెంచలమ్మ, సర్పంచి సురేష్‌బాబు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులే లక్ష్యం

నెల్లూరు రూరల్ : రైతులు తమ పంటపొలాల్లో తక్కువ పెట్టుబడులతో ఎక్కువ దిగుబడులు సాధించేందుకు పొలం పిలుస్తోంది కార్యక్రమం దోహదపడుతుందని టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఆమంచర్ల గ్రామంలో వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి ఆయన రైతు సదస్సులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో నాగమోహన్, సర్పంచ్ రమణమ్మ, మలినేని వేణునాయుడు, అల్లాభక్షు పాల్గొన్నారు. కాగా, 28వ డివిజన్ కేశవులనగర్‌లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో గిరిధర్‌రెడ్డి స్థానిక కార్పొరేటర్ చెక్క అలహ్య, సాయి సునీల్ పాల్గొన్నారు. అనంతరం 33వ డివిజన్ వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు.

రేపు మూర్ఛవ్యాధికి ఉచిత వైద్యం

నెల్లూరు(వైద్యం) : నారాయణ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో మూర్ఛ వ్యాధిగ్రస్తులకు ఈనెల 26వ తేదీన ప్రత్యేక ఎపిలెప్సీ క్లినిక్ ద్వారా ఉచిత వైద్యం అందించనున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పూర్తి వివరాలకు 9640100555ను సంప్రదించాలన్నారు.

క్రీడాకారిణి పూజితకు కలెక్టర్ అభినందన

నెల్లూరు (విద్య), సెప్టెం బరు 24 : ఆట్యా పాట్యా అంతర్జా తీయ క్రీడాకారిణి తుమ్మల పూజితను కలెక్టర్ ఓ ఆనంద్ అభినందించారు. కలెక్టర్‌ను ఆయన చాంబర్‌లో మంగళ వారం పూజిత మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూటాన్‌లో జరిగిన 8వ సౌత్ ఏషియన్ ఆట్యాపాట్యా చాంపియన్‌షిప్ పోటీల్లో బీవీఎస్ నగరపాల క ఉన్నత పాఠశాల విద్యార్థిని పూజిత పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం విజయజ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు సౌత్‌మోపూరు విద్యార్థులు

నెల్లూరు రూరల్, సెప్టెంబరు 24 : గుంటూరు జిల్లా వినుకొండలో ఈ నెల 28న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు మండలంలోని సౌత్‌మోపూరు వాణిశ్రీ జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ మేరకు వారిని మంగళవారం స్కూల్లో అభినందించారు. 21వ తేదీన పొదలకూరు మండలం మహ్మదాపురంలో జరిగిన ఎంపికల్లో స్థానిక స్కూల్‌కు చెందిన అండర్ -17లో వీ మోహన్, బీ నితీష్, బాలికల విభాగంలో జీ పుష్ప, బీ వైష్ణవిలు జిల్లా జట్టుకు ఎంపికైనట్లు హెచ్ఎం శ్రీనివాసులు, పీఈటీ నాగేంద్రరావు తెలిపారు.

దళితవాడలో న్యాయ విజ్ఞాన సదస్సు



న్యాయ విజ్ఞాన సదస్సులో ప్రసంగిస్తున్న సీనియర్ సివిల్ జడ్జీ వాణి

ఇందుకూరుపేట, సెప్టెంబరు 24 : ఇందుకూరుపేట దళితవాడలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సదస్సులో జిల్లా సేవా సాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ న్యాయాధికారి కె.వాణి ముఖ్య అతిథిగా పాలొని మాట్లాడుతూ రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను వివరించారు. ఎక్కడైనా పరిష్కారం కాని సమస్యలను లోక్ అదాలత్ ద్వారా రూ.1 ఖర్చు లేకుండా పరిష్కరిస్తామని తెలిపారు. మహిళలు, బాలికల అక్రమ రవాణాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పేదలు ఏమీ అవసరం ఉన్నా జిల్లా న్యాయ సేవ అధికార సంస్థను సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు కృష్ణప్రసాద్, ఏపీఎంఎన్ రవిశంకర్‌రెడ్డి, ఏఎస్ఐ భాస్కర్‌రాజు పాల్గొన్నారు.

ఆధునిక వైద్యంలో పీహెచ్‌పీల్లో పోటీతత్వం

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 24 : ఆధునిక వైద్యం అందించడంలో పీహెచ్‌పీలు పోటీ పడుతున్నారని నారాయణ మెడికల్ గ్రూప్ ఏజీఎం చౌకిచర్ల భాస్కర్‌రెడ్డి వెల్లడించారు. మంగళవారం నగరంలో పుర మందిరంలో గుండె, చెవి, ముక్కు, గొంతు సమస్యలపై ఏర్పాటు చేసిన అవగాహన సదుస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ సుజిత, గుండె వైద్య నిపుణులు డాక్టర్ నాగభూషణ్‌లు మాట్లాడుతూ పేదలకు అందుబాటులో ఉండడంతోపాటు అత్యవసర సమయాల్లో వారిని ఆసుపత్రికి తరలించేం దుకు పీఎంపీలు ఎంతో కృషి చేస్తున్నార న్నారు. ఈఎన్‌టీ వైద్యులు డాక్టర్ సుమన్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ చెవి, ముక్కు, గొంతు వైద్యానికి రాయితీతో కూడిన అత్యాధునిక వైద్యం అందిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా పీఎంపీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్‌ను వైద్యులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌పీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, జిల్లా యూత్ కోఆర్డినేటర్ డాక్టర్ మహేంద్రరెడ్డి, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ షేక్ రసూల్, గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, నంద్యాల మాలిని, నరసాపురం ప్రసాద్, రామదాసు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అసౌకర్యం లేకుండా సేవలు



నెల్లూరు (సాంస్కృతికం) : వచ్చే నెలలో జరిగే రాజరాజేశ్వరి అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలలో భక్తులకు ఏలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోవాలని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఆలయంలో నగర పాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ, ఆర్డీవో మాలోలతో కలిసి అన్ని శాఖల అధికారులతో ఉత్సవాల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆలయ పరిసరాల్లో రాజకీయ ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 11వతేదీ రాత్రి ఆలయం ముందు భక్తులతో సామూహికంగా 60 అడుగుల భారీ రావణ విగ్రహ దహనం కార్యక్రమం జరుగుతుదని తెలిపారు. అనంతరం కమిషనర్ సూర్యతేజ ఉత్సవా ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ఉత్సవాల పోస్టర్లు ఆవిష్కరించారు. 19 మంది సభ్యులతో దసరా ఉత్సవ కమిటీని ప్రకటించారు. చైర్మన్‌గా అళహరి విజయకుమార్ నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రత్నం జయరామ్, సన్నపరెడ్డి పెంచలరెడ్డి, ఆల్తూరి గిరీష్‌రెడ్డి, ఈవో సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి, రాజానాయుడు, తదితరులు పాల్గొన్నారు.



శాప్ ఛైర్మన్‌గా రవి నాయుడు

● వివిధ కార్పొరేషన్ల మెంబర్లుగా పరసా, ఊకా సహా ఐదుగురు

● తిరుపతి జిల్లాలో ఆరుగురికి తొలి విడత నామినేటెడ్ పదవులు

తిరుపతి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తొలివిడతగా మంగళవారం ప్రకటించిన నామినేటెడ్ పదవుల జాబితాలో తిరుపతి జిల్లా నుంచీ ఆరుగురు టీడీపీ నేతలకు చోటు దక్కింది. తిరుపతికి చెందిన తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిమిని రవినాయుడు శాప్ (ఏపీ స్పోర్ట్స్ అథారిటీ) ఛైర్మన్‌గా ఛాన్సు కొట్టేశారు. మిగిలిన ఐదుగురూ వివిధ కార్పొరేషన్లలో మెంబర్లుగా పదవులు దక్కించుకున్నారు. ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో తిరుపతి టీడీపీ నేత ఊకా విజయ్‌కుమార్, సత్యవేడు టీడీపీ నేత డాక్టర్ పి.చందన స్రవంతి మెంబరు పదవులను పొందారు. సూళ్ళూరుపేట నియోజకవర్గానికి చెందిన టీడీపీ నేత, మాజీ మంత్రి పరసా రత్నం మార్క్‌ఫెడ్ మెంబరు పదవి పొందగా నగరి నియోజకవర్గానికి చెందిన టీడీపీ నేత గంజి మాధవయ్య, వెంకటగిరి నియోజకవర్గానికి చెందిన టీడీపీ నేత గంగాధర శ్రీరామదాసు ఏపీ పద్మశాలి వెల్ఫేర్ కార్పొరేషన్ మెంబర్లుగా పదవులు దక్కించుకున్నారు.



వూకా విజయకుమార్, పరసారత్నం, చందన స్రవంతి, గంగాధర శ్రీరామదాసు, గంజి మాధవయ్య

యువ నాయకుడి కష్టానికి గుర్తింపు

తిరుపతికి చెందిన రవినాయుడికి శాప్ ఛైర్మన్ దక్కడంతో యు వ నాయకుడి కష్టాన్ని అధిష్ఠానం గుర్తించినట్టయింది. సామాన్య కార్యకర్తగా పార్టీతో ప్రయాణం మొదలుపెట్టి అంచెలంచెలుగా రాష్ట్రస్థాయికి ఎదగడంతోపాటు పార్టీ భావినేత నారా లోకేశ్ వెంట నిలవడం ఇతడికి ప్రత్యేక గుర్తింపునిచ్చింది. 2005లో ఓరియంటల్ కాలేజీ స్టూడెంట్స్ యూనియన్ ఛైర్మన్‌గా విద్యార్థి రాజకీయాల్లో అడుగుపెట్టిన రవినాయుడు తర్వాత టీఎన్ఎస్ఎఫ్‌లో చేరి చంద్రగిరి నియోజకవర్గ అధ్యక్షుడిగా, ఎస్వీయూ ప్రధాన కార్యదర్శిగా, రెండుసార్లు అధ్యక్షుడిగా, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా, జాతీయ కమిటీ సమన్వయకర్తగా పనిచేశారు. 2020లో తిరుపతి తెలుగుయువత పార్లమెంటు అధ్యక్షుడిగా నియమితులైన ఆయన 2021లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగానూ, రాష్ట్ర కార్యక్రమాల సమన్వయకర్తగానూ నియమితులయ్యారు. యువనేత నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర మొదటి దశలో వలంటీర్ల కో ఆర్డినేటర్‌గానూ, రెండవ దశలో యాత్ర కో ఆర్డినేటర్‌గానూ పనిచేయడం రవినాయుడిని లోకేశ్ టీమ్ మెంబరును చేసింది. అధినేత చంద్రబాబు అక్రమ కేసులో అరెస్టయిన సందర్భంగా ఆయన సతీమణి నారా భువనేశ్వరి నిజం గెలవాలి పేరిట చేపట్టిన యాత్రకు కూడా రవినాయుడు కో ఆర్డినేటర్‌గా వ్యవహరించారు. ఈ కార్యక్రమాలతో అధినేత కుటుంబానికి చేరువయ్యారు. గత ఐదేళ్ళ వైసీపీ ప్రభుత్వంలో హత్యాయత్నం, ఎస్సీ అట్రాసిటీ తదితర కేసులతో సహా మొత్తం 57 కేసులు నమోదైనా, ఆ కేసుల్లో అర్ధరాత్రిళ్ళు అరెస్టయినా, ఎన్నోసార్లు గృహ నిర్బంధాలకు లోనైనా వెరవకుండా పార్టీ కోసం కష్టపడి పనిచేయడాన్ని పార్టీ అధిష్ఠానం గుర్తించింది. ఈ నేపధ్యంలో శాప్ ఛైర్మన్ వంటి రాష్ట్రస్థాయి పదవి దక్కడం పార్టీ శ్రేణులకు కూడా సానుకూల సంకేతాన్ని, సందేశాన్ని ఇచ్చినట్టయింది.

తొలి విడతలో టీడీపీ నేతలకే ఛాన్సు

తొలి విడత నామినేటెడ్ పదవుల్లో తిరుపతి జిల్లా నుంచీ కేవలం టీడీపీ నేతలకే అవకాశం దక్కింది. జిల్లాలో ఆరు నియోజకవర్గాలుండగా మొదటి దఫా చేపట్టిన పదవుల భర్తీలో తిరుపతి, వెంకటగిరి, సూళ్ళూరుపేట, సత్యవేడు నియోజకవర్గాలతో పాటు నగరి పాక్షిక నియోజకవర్గ నేతలకు అధిష్ఠానం గుర్తింపు కల్పించింది. ఈ దఫా శ్రీకాళహస్తి, గూడూరు, చంద్రగిరి నియోజకవర్గాల నేతలెవరికీ అవకాశం రాలేదు. కాగా ప్రభుత్వం ప్రకటించిన తాజా పదవుల జాబితాలో జిల్లా నుంచీ టీడీపీ మినహా కూటమిలోని ఇతర మిత్రపక్షాలైన జనసేన, బీజేపీ నేతలకు అవకాశం రాలేదు. తొలి జాబితాలో ప్రకటించింది కేవలం 20 కార్పొరేషన్లు మాత్రమే కావడం, ఇంకా భర్తీ చేయాల్సిన పదవులు బోలెడు వుండడంతో మలి విడతలో ఆ పార్టీల నేతలకు అవకాశం దక్కుతుందని భావిస్తున్నారు.

చిత్తూరు జిల్లాకు ఏదీ సముచిత స్థానం..?

● ఒక్కరికీ దక్కని కార్పొరేషన్ ఛైర్మన్ పదవి

చిత్తూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లాకు నామినేటెడ్ పదవుల్లోనూ తొలివిడతలో సముచిత స్థానం దక్కలేదు.20 కార్పొరేషన్లకు ఛైర్మన్ పదవుల్ని భర్తీ చేయగా.. జిల్లాకు ఒక్కటీ కేటాయించలేదు.ఆర్టీసీ వైస్ ఛైర్మన్‌గా కుప్పం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పీఎస్ మునిరత్నం,టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా చిత్తూరు మాజీ మేయర్ కటారి హేమలతకు మాత్రమే అవకాశం దక్కింది.నగరి నియోజకవర్గంలోని పుత్తూరు మాజీ ఎంపీపీ గంజి మాధవయ్యకు పద్మశాలి సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా అవకాశం లభించింది. ఈయన ఎమ్మెల్యే భానుప్రకాష్ ప్రకాష్ వెన్నంటే ఉంటూ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కష్టపడ్డారు. దీంతో పార్టీ గుర్తించి పదవి ఇచ్చింది.



● పీఎస్ మునిరత్నానికి గౌరవం

కుప్పం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పీఎస్ మునిరత్నం ఆవిర్భావం నుంచీ పార్టీలో ఉన్నారు. చంద్రబాబుతో కలిసి ఎస్వీయూలో చదువుకోవడంతో పాటు ఆయన కుప్పంలో పోటీ చేస్తున్నప్పటి నుంచి వెంటే నడుస్తున్నారు. గతంలో రెస్కో ఛైర్మన్‌గా పనిచేశారు. ఆయన సీనియారిటీని గుర్తించి ఆర్టీసీ వైస్ ఛైర్మన్‌గా అవకాశం కల్పించారు.అయితే కుప్పంలో సీనియర్ నాయకుల్ని గౌరవించడంతో పాటు కొత్తవారికి కూడా అవకాశం కల్పించాలని అక్కడి టీడీపీ శ్రేణులు కోరుతున్నాయి. కుప్పం మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ ఓటమి చెందినప్పుడు.. సమీక్ష నిర్వహించిన చంద్రబాబు ఇక కొత్తవారిని ప్రోత్సహిస్తానని హామీనిచ్చారు. దీంతో నామినేటెడ్ పదవులపై కొత్తతరం నాయకులు ఆశలు పెట్టుకున్నారు. వచ్చే జాబితాలో అయినా తమ పేర్లుంటాయని ఆశిస్తున్నారు.

● డైరెక్టర్ పోస్టుకు హేమలత పరిమితం



చిత్తూరు మాజీ మేయర్ కటారి హేమలత అత్తామామలు కటారి అనురాధ, మోహన్ 2016లో హత్యకు గురయ్యారు. అత్త మేయర్ పోస్టులో ఆమె పనిచేశారు. తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. భర్త ప్రవీణ్ కరోనా సమయంలో మరణించి ఈమెను ఒంటరిగా మార్చారు. గత ఐదేళ్లలో వైసీపీ వేధింపుల్ని దీటుగా ఎదుర్కొని టీడీపీ కోసం శ్రమించారు. శ్రేణుల్ని కాపాడుకున్నారు. ఎమ్మెల్యే టికెట్ ఆశావహుల్లో ఈమె కూడా ఒకరిగా నిలిచారు.ఈమెకు ఏదైనా పెద్ద పదవే లభిస్తుందని అనుకుంటుండగా టూరిజం డైరెక్టర్ పోస్టుకు పరిమితం చేశారు.



పోలేరమ్మ (ఫైల్ ఫొటో)

పోలేరమ్మ జాతరకు పోదాం రండి..

● వెంకటగిరిలో నేడు, రేపు వేడుక

● భారీగా తరలిరానున్న భక్తులు

వెంకటగిరి, సెప్టెంబరు 24: ప్రతిష్ఠాత్మక వెంకటగిరి పోలేరమ్మ జాతరకు దశాబ్దాల చరిత్ర ఉంది. స్వరూపిణిగా వర్ధిల్లుతున్న అమ్మవారి జాతరకు విదేశాల్లో స్థిరపడ్డ స్థానికులు సైతం వచ్చి మెక్కులు తీర్చుకుంటారు. బుధ, గురువారాల్లో కోలాహలంగా ఈ వేడుక జరగనుంది. ఇక్కడ కొలువుదీరిన పోలేరమ్మ భక్తకోటి మొక్కులు అందుకోవడం వెనుక విశేషముందని స్థల పురాణం చెబుతుంది. 1913లో కలరా మహమ్మారి వెంకటగిరిని అతలాకుతలం చేసింది. భారీగా ప్రాణాలను బలితీసుకుంది. దీంతో వెంకటగిరి సంస్థానాధీశులు ప్రజారక్షణకు శీతల యాగాన్ని నిర్వహించారు. శిలలను పొలిమేరల్లో ప్రతిష్ఠించారు. నాడు ప్రతిష్ఠించిన శీతల రాళ్లకు ఏటా పెద్ద ఎత్తున జాతర నిర్వహిస్తామని సంస్థానాధీశులు పోలేరమ్మకు మొక్కుకున్నారు. కలరా కనుమరుగైన నేపథ్యంలో నాటి నుంచి సంస్థానాధీశుల ఆధ్వర్యంలో పోలేరమ్మ జాతరను వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అంతకుముందు 1714లో కూడా ఇక్కడ పోలేరమ్మ జాతర జరిగిందని చరిత్ర చెబుతోంది. వినాయకచవితి తర్వాత మొదటి బుధవారం అర్ధరాత్రి దాటాక మొదటి చాటింపు వేయించారు. రెండో చాటింపు తర్వాత ఆదివారం అమ్మవారికి ఘనంగా ఘటోత్సవం నిర్వహించారు. గాలిగంగల మండపంలో రెండు మట్టికుండలను ఉంచి పూజలు చేశారు. ఆ కుండలను పోలేరమ్మ తల్లి అత్తగారి నివాసమైన చాకలివీధికి తరలించారు. పవిత్రమైన ఆ కుండలకు భక్తులు నమస్కరించి అంబళ్లు పోశారు. ఘటం కుండలు ప్రతి ఇంటా పూజలందుకోవడంతో జాతర సందడి మొదలయ్యింది. మూడో చాటింపుతో బుధవారం అమ్మవారు భక్తుల దర్శనార్థం కొలువుదీరుతారు. రెండు రోజుల పాటు వైభవోపేతంగా జాతర నిర్వహిస్తారు. గురువారం అమ్మవారిని ఊరేగించే విరూపోత్సవంతో పోలేరమ్మ జాతర ముగుస్తుంది.

చిన్నారుల మడి భిక్షాలతో వినూత్న శోభ

వెంకటగిరి టౌన్ : పోలేరమ్మ జాతర సందర్భంగా చిన్నారులు కొత్త వస్త్రాలను ధరించి మడి భిక్షాలకు బయల్దేరడం ఆనవాయితీ. 'పోలేరమ్మకు మడిభిక్షం పెట్టండి... పోతురాజుకు టెంకాయ కొట్టండి... పగలకపోతే నా నెత్తిన కొట్టండి' అంటూ చిన్నారులు ఇంటింటా తిరుగుతూ జాతరకు కొత్త శోభ తీసుకొస్తారు. ఇళ్లలో వేపమండలను తోరణాలుగా అలంకరిస్తారు. పసుపుతో పోలేరమ్మ ప్రతిమను తయారు చేసి, భక్తి శ్రద్ధలతో పూజలు చేస్తారు. బంధువులందరికీ అంబలి పంచుతారు. బుధవారం మొలకెత్తిన నవధాన్యాలు, వేపమండలు, వెయ్యికళ్ల దుత్తలను పోలేరమ్మ తల్లి ప్రతిమ వద్ద ఉంచి మహిళలు పూజలు నిర్వహిస్తారు. మంగళవారమే భక్తులు, బంధువుల సందడి మొదలైంది. తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి కూడా భారీగా భక్తులు రావడం ప్రారంభమైంది. భక్తుల రద్దీ నేపథ్యంలో పట్టణంలో టాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు.



హర్షవర్ధన్‌రాజు

సిట్ సభ్యులుగా ఇద్దరు పూర్వ ఎస్పీలు



గోపీనాథ జెట్టి

● ఏఎస్పీ వెంకట్రావు, సీఐ రామ్‌కిషోర్ కూడా ● నెయ్యి కల్తీపై విచారణకు ప్రభుత్వ నియామకం

తిరుపతి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేశారన్న ఆరోపణపై విచారణ జరిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమించింది. అందులో ఇదివరకూ జిల్లాలో పనిచేసిన ఇద్దరు ఎస్పీలు వుండడం విశేషం. సిట్ (స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్)కు గుంటూరు రేంజి ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి అధిపతిగా వ్యవహరించనుండగా విశాఖ రేంజి డీఐజీ గోపీనాథ జెట్టి, కడప ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సభ్యులుగా వ్యవహరించనున్నారు.తిరుపతి అడ్మిన్ ఏఎస్పీ వెంకట్రావు, అలిపిరి సీఐ రామ్‌కిషోర్, మరికొందరు డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు కూడా సిట్‌లో సభ్యులుగా నియమితులు కానున్నారు. కీలక అధికారులైన గోపీనాథజెట్టి, హర్షవర్ధనరాజు గతంలో తిరుపతి జిల్లాలో పనిచేశారు. వీరిలో గోపీనాథజెట్టి గత టీడీపీ ప్రభుత్వంలో రెండున్నరేళ్ళ పాటు తిరుపతి అర్బన్ ఎస్పీగానూ, తర్వాత టీటీడీ సీవీఎస్వోగానూ పనిచేశారు. ఇక హర్షవర్ధన్‌రాజు ఈ ఏడాదిలోనే స్వల్ప కాలం పాటు జిల్లా ఎస్పీగా పనిచేశారు. గోపీనాథజెట్టి మునుపు తిరుపతి అర్బన్ ఎస్పీగాగానూ, టీటీడీ సీవీఎస్వోగానూ పనిచేసి వున్నందున టీటీడీ సెక్యూరిటీ సహా పాలనా వ్యవహారాలపై లోతైన అవగాహన వుంది. అందుకే ప్రత్యేకంగా ఆయనను ఏరికోరి ప్రభుత్వం సిట్‌లో నియమించింది. ఇక హర్షవర్ధన్‌రాజు నిజాయితీపరుడిగానూ, ముక్కుసూటిగానూ పనిచేస్తారన్న పేరుంది. అందుకే ఆయన తిరుపతి ఎస్పీగా నియమితులైన స్వల్ప కాలానికే ప్రభుత్వం కడప జిల్లా ఎస్పీగా బదిలీ చేసింది. ఒత్తిళ్లకు లొంగరన్న పేరున్న కారణంగా ఆయనను సిట్‌లో నియమించినట్టు సమాచారం. వీరు సభ్యులుగా వున్న సిట్ శ్రీవారి లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి వినియోగించారన్న ఆరోపణలపై దర్యాప్తు జరిపి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది.

విషాదం

శనగ్గింజ గొంతులో ఇరుక్కుని మూడు నెలల చిన్నారి మృతి

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 24:గొంతులో వేరుశనగ గింజ ఇరుక్కుని మూడు నెలల చిన్నారి మృతి చెందిన దురదృష్టకర ఘటన మంగళవారం తిరుపతి రూరల్ మండలం వినాయకనగర్‌లో చోటు చేసుకుంది. సీఐ చిన్న గోవిందు కథనం మేరకు...వినాయకనగర్‌లో కాపురమున్న మేస్త్రీ రాజేష్,జయంతి దంపతులకు మూడు నెలల కుమార్తె వుంది.రెండ్రోజుల క్రితం జయంతి వరండాలో మంచంపై నిద్రిస్తుండగా పక్కింట్లో వుంటోన్న జయంతి అన్న కుమారుడు శాంతన్ ఆడుకుంటూ వచ్చి తాను తింటున్న వేరుశనగ గింజను పాప నోట్లో వేసి తినమని చెప్పాడు. ఆ గింజ గొంతులో అడ్డుపడడంతో పాపకు ఊపిరాడక గిలగిలా కొట్టుకుంది.గమనించి వెంటనే రుయాస్పత్రికి తీసుకెళ్ళారు. అక్కడ పాప పరిస్థితి మెరుగుపడకపోవడంతో చెన్నై ఎగ్మోర్ ఆస్పత్రికి తీసుకెళ్ళారు.అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం పాప మృతి చెందింది.

వామ్మో..ఎంత పెద్ద పామో!



తిరుమల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి):తిరుమలలో మంగళవారం సుమారు 10అడుగుల పొడవైన పాము పట్టుబడింది. వీఐపీలు బసచేసే పద్మావతి ఏరియాలోని లలితసత్యం అతిథిగృహానికి సమీపానికి వచ్చిన ఈ పామును చూసిన భక్తులు, సిబ్బంది హడలిపోయారు. వెంటనే టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర్‌నాయుడికి సమాచారమిచ్చారు. ఆయన చేరుకుని పామును పట్టుకుని అడవిలో విడిచిపెట్టారు.

సేవ్ తిరుమల సేవ్ టీటీడీ



టీటీడీ కార్యాలయంలోకి వెళ్లేందుకు పోలీసులతో స్వామీజీల వాగ్వాదం

● కల్తీ నెయ్యిపై హిందూ సంఘాల నిరసన

తిరుపతి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : 'సేవ్ తిరుమల- సేవ్ టీటీడీ' నినాదం తిరుపతిలో హోరెత్తింది. కల్తీ నెయ్యి దోషులను కఠినంగా శిక్షించాలంటూ తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనం ఎదుట తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు స్వామీజీలు, హిందూ సంఘాల ప్రతినిధులు మంగళవారం ఉదయం నిరసన దీక్ష చేపట్టారు. ఛలో తిరుపతి పేరిట చేపట్టిన ఈ కార్యక్రమంలో 'తిరుమల క్షేత్రాన్ని కాపాడుకుందాం...శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని పరిరక్షించుకుందాం. కల్తీ దొంగలను వెంటనే శిక్షించాలి. జగన్మోహన్ రెడ్డి క్షమాపణలు చెప్పాలి' వంటి నినాదాలు చేశారు. దాదాపు ఇరవైమంది స్వామీజీలు, హిందూ సంఘాల ప్రతినిధులు తరువాత ఈవో శ్యామలరావును కలిశారు. కల్తీ నెయ్యి వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరపాలని, బాధ్యులను కఠినంగా శిక్షించాలని కోరారు. తిరుపతిలో వేలాది ఎకరాల హథిరాంజీ భూములు ఉన్నాయని అక్కడ పెద్దఎత్తున గోశాలలు ఏర్పాటుచేయాలని కోరారు. తద్వారా వచ్చే నెయ్యిని శ్రీవారికి వినియోగించాలన్నారు. ఈ అంశాలను పరిశీలిస్తామని ఈవో హామీ ఇవ్వడంతో నిరసన విరమించి వెనుదిరిగారు. ఈసందర్భంగా స్వామీజీలు మీడియాతో మాట్లాడుతూ శ్రీవారి లడ్డూ ప్రసాదాలను అపవిత్రం చేసినవారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.320 రూపాయలకు కిలో నెయ్యి ఎక్కడైనా వస్తుందా? వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర రెడ్డి, ధర్మారెడ్డి ఎవరిని మోసం చేయాలని కల్తీ నెయ్యి తెప్పించారని మండిపడ్డారు. వైసీపీ పాలనలో తిరుమలను వ్యాపారకేంద్రంగా మార్చారని ఆందోళన వ్యక్తం చేశారు. అన్నదానంలో పురుగులు పట్టిన అన్నం పెట్టారని, చంటి బిడ్డలకు పాలు కూడా ఇవ్వలేకపోయారని, టీటీడీ వెబ్‌సైట్‌లో శిలువ గుర్తులు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కలియుగ దైవం శ్రీవేంకటేశ్వర స్వామిని, యావత్ హిందువులను క్షమించమని కోరితే క్షమిస్తారని చెప్పారు. లేకుంటే వైసీపీ నాయకులను హిందూ సమాజం వెలివేస్తుందని, శ్రీనివాసుడి ఆగ్రహానికి గురిగాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసా నంద సరస్వతి స్వామి (శ్రీకాకుళం), భైరవానంద స్వామి (ఒంగోలు), మహదేవానంద స్వామి (కామా రెడ్డి), శివానంద స్వామి (మహబూబ్ నగర్), తిరుపతికి చెందిన గణేష్ స్వామి, ఓంకార్, కిరణ్, బండ్ల లక్ష్మీపతి, రెడ్డి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



చంద్రగిరి కోటలో సౌండ్ అండ్ లైటింగ్ షో



ట్రయల్ రన్ సక్సెస్

27న వర్చువల్‌గా ప్రారంభించనున్న సీఎం

చంద్రగిరి, సెప్టెంబరు 24: చంద్రగిరి కోటలో సౌండ్ అండ్ లైటింగ్ షో ట్రయల్ రన్ విజయవంతమైంది. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఈ సౌండ్ అండ్ లైటింగ్ షోను ఈనెల 27న సీఎం చంద్రబాబు వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. మంగళవారం రాత్రి ట్రయల్ రన్ నిర్వహించారు. ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా, రాష్ట్ర పర్యాటక శాఖ, లక్స్ అండ్ డెసిబెల్స్ భాగస్వామ్యంతో సంయుక్తంగా పబ్లిక్, ప్రైవేటు పార్ట్‌నర్‌షిప్ విధానంలో రూ.6 కోట్లతో లైట్స్ అండ్ సౌండ్‌ను ఏర్పాటు చేశారు. ట్రయల్ రన్‌ను పర్యాటక శాఖ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ రమణప్రసాద్, కేంద్ర ఆర్కియాలజీ సబ్ సర్కిల్ ఇన్‌ఛార్జి ప్రవీణ్ కుమార్ తిలకించారు. ఆరేళ్ల తర్వాత చంద్రగిరి కోటకు పూర్వ వైభవం రానుంది.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ కిషోర్‌బాబు, ఎస్‌ఐ మనోజ్ కుమార్ - ఆనందమ్మ మృతదేహం

మహిళ దారుణ హత్య

గూడూరు, సెప్టెంబరు 24: మండలంలోని చెన్నూరు గ్రామంలో మంగళవారం ఓ మహిళ దారుణ హత్యకు గురైంది. రూరల్ పోలీసుల కథనం మేరకు.. చెన్నూరు గ్రామానికి చెందిన ఆనందమ్మ(42) ఓ ప్రైవేటు కంపెనీలో కార్మికురాలిగా పనిచేస్తుండేది. ఈమెకు అల్లుడు వరసైన రమేష్ వంట మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. వివాహితులైన వీరిరువురు గత కొన్నేళ్లుగా చెన్నూరులోని శెట్టిగారిబీడు ప్రాంతంలో ఓ ఇంట్లో నివాసం ఉంటూ సహజీవనం చేస్తుండేవారు. ఇటీవల ఆనందమ్మకు, రమేష్‌కు మధ్య మనస్పర్థలు రావడంతో తరచుగా గొడవలు పడుతుండేవారు. మంగళవారం ఇంట్లో ఆనందమ్మ నిద్రిస్తున్న సమయంలో రమేష్ కర్రతో ఆమె తలపై గట్టిగా కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందింది. స్థానికులు సమాచారం ఇవ్వడంతో రూరల్ సీఐ కిషోర్‌బాబు, ఎస్‌ఐ మనోజ్‌కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

26న జాబ్‌మేళా

గూడూరు అర్బన్, సెప్టెంబరు 24: స్థానిక ఐటీఐ కళాశాలలో ఈనెల 26వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం మంగళవారం తెలిపారు. పదో తరగతి నుంచి బీటెక్ పాస్ అయిన వారు అర్హులన్నారు. వివరాలకు 8639835953 నంబరు సంప్రదించాలన్నారు.

హెల్మెట్లు ధరించండి

తడ, సెప్టెంబరు 24: ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనం నడపాలని సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ తెలిపారు. మంగళవారం సాయంత్రం అపాచీ సెజ్‌రోడ్డు వద్ద ద్విచక్ర వాహన దారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. సీఐతో పాటు ఎస్‌ఐ కొండపనాయుడు ఉన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

వాకాడు, సెప్టెంబరు 24: మండలంలోని బాలిరెడ్డిపాళెం విద్యార్థి ధరణికోట మహేష్ ఉన్నత చదువుల కోసం సీతారామ ధార్మికసేవాసంస్థ ఆధ్వర్యంలో నాగలాపురం గిరిధర్‌రెడ్డి, ఉమామహేశ్వరమ్మ దంపతులు రూ.6వేలు అందజేశారు.

మొదలైన జాతర సందడి

- నేడు చిన్నారుల మడిభిక్షాలు
- అమ్మవారి విగ్రహం తయారీ

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 24: వెంకటగిరి పట్టణంలో గ్రామశక్తి పోలేరమ్మ జాతర సందడి నెలకొంది. బుధవారం చిన్నారులు మడి భిక్షాలకు బయలుదేరడంతో రెండు రోజుల జాతర మహోత్సవానికి శ్రీకారం చుడుతారు. సంప్రదాయ ప్రకారం చిన్నారులు తలంటు స్నానాలు ఆచరించి, నూతన వస్త్రాలను ధరించి మడిభిక్షాలకు బయల్దేరుతారు. 'పోలేరమ్మకు మడిభిక్షం పెట్టండి.. పోతురాజుకు టెంకాయ కొట్టండి.. పగలకపోతే నా నెత్తిన కొట్టండి' అంటూ మడిభిక్షం ఎత్తుకుని చిన్నారులు ఇంటింటా తిరుగుతూ జాతరకు ఆహ్వానం పలుకుతారు. ఇళ్లలో వేపమండలను తోరణాలుగా అలంకరిస్తారు. పసుపుతో పోలేరమ్మ ప్రతిమను తయారు చేసి భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు నిర్వహిస్తారు. అంబలి తయారు చేసి బంధువులందరికీ పంచి పెడుతారు. బుధవారం మొలకెత్తిన నవధ్యాన్యాలు, వేపమండలు, వెయ్యికళ్ల దుత్తలను పోలేరమ్మ తల్లి ప్రతిమ వద్ద ఉంచి మహిళలు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహిస్తారు. గురువారం ఉదయం వీటిని పోలేరమ్మ సన్నిధానంలో అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు.

ముమ్మరంగా ఏర్పాట్లు

గ్రామశక్తి పోలేరమ్మ జాతరకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. మున్సి పాలిటీ, దేవదాయశాఖ, ఆలయ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో పట్టణంలో అమ్మవారి ఊరేగింపు జరిగే రాజవీధిలో చెట్ల కొమ్మలను తొలగించే పనులను పూర్తి చేశారు. ఆలయానికి రంగులు వేయడం దాదాపు పూర్తి చేశారు. లైటింగ్ ఏర్పాటు చేస్తున్నారు. స్థానికులు ఇళ్లకు రంగులు వేయడం, దూర ప్రాంతాల్లో స్థిర పడిన బంధువులను, స్నేహితులను జాతరకు ఆహ్వానించడంలో నిమగ్నమయ్యారు. సంచార దుకాణాలు, రంగులరాట్నం, ఎగ్జిబిషన్‌లు ఏర్పాటయ్యాయి.





పూజలందుకుంటున్న పోలేరమ్మ శిలాప్రతిమ - ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

పెరిగిన రద్దీ..

రాష్ట్రంతోపాటు తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తుల రాకతో వెంకటగిరిలో మంగళవారం నుంచి రద్దీ పెరిగింది. బుధవారానికి ఇది మరింత పెరిగే అవకాశముంది. ఈ క్రమంలో ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలని సీఐ ఏవీ రమణ కోరారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ జాతరకు లక్షలాది మంది వస్తారని, ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు సహకరించాలని కోరారు.



ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన జైంట్‌వీల్, కోలంబస్

అమ్మవారి దర్శనం కోసం ఇలా..

పోలేరమ్మ దర్శనార్థం వచ్చే భక్తులకు పాత బస్టాండ్ మార్గం నుంచి రూ.100, రూ.200, రూ.300 క్యూలు ఏర్పాటు చేశారు. రూ.500 టికెట్ తీసుకున్న వారు రాజావీధి నుంచి పోలేరమ్మ ఆర్చి మీదుగా వెళ్లవచ్చు. వీవీఐపీలు రాజాకోట ముందు వాహనాలు పార్కింగ్ చేసి, ఆర్చి మీదుగా దర్శనానికి వెళ్లి తిరిగి అక్కడికే వస్తారు. ఈ మేరకు పోలీసులు మంగళవారం రూట్ మ్యాప్ విడుదల చేశారు.

పోలేరమ్మ గుడిలో సంప్రోక్షణ పూజలు



సంప్రోక్షణ పూజలో ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, సెప్టెంబరు 24: గ్రామశక్తి పోలేరమ్మ గుడిలో మంగళవారం ఉదయం సంప్రోక్షణ పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అమ్మవారి స్వర్ణ పాదాలకు సంప్రోక్షణ చేశారు. సుమారు గంట పాటు సాగిన ఈ పూజా కార్యక్రమం పండితుల మంత్రోత్సాహాల నడుమ ఘనంగా జరిగింది. అనంతరం అమ్మవారిని దర్శించుకొన్న ఎమ్మెల్యే రామకృష్ణ తొలి దర్శన టికెట్లను ఈవో శ్రీనివాసులురెడ్డి ద్వారా కొనుగోలు చేశారు. ఈ ఏడాది తొలిసారి వీవీఐపీ పాసులు రద్దు చేశారు. దీంతో అందరూ టికెట్టు తీసుకొని అమ్మవారి దర్శించుకోవాలని ఎమ్మెల్యే చెప్పారు. కాగా, సాయంత్రం 6 గంటలకు వెంకటేశ్వర ప్యాలెస్ సెంటరు నుంచి పోలేరమ్మ దేవస్థానం మీదుగా జగన్నాథపురం వారిచే కాంతారా బృందం నృత్య ప్రదర్శన వైభవంగా నిర్వహించారు.

జగన్ తీరుతో తిరుమలకు అప్రతిష్ట: కురుగొండ్ల



దక్కిలి, సెప్టెంబరు 24: మాజీ సీఎం జగన్ తీరుతో కలియుగ దైవం వెంకటేశ్వరస్వామి కొలువైన తిరుమల అప్రతిష్టపాలైందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ వ్యాఖ్యనించారు. దక్కిలిలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ లడ్డూ ప్రసాదాలకు వినియోగించే నెయ్యి కల్తీకి జగన్ బాధ్యత వహించాలన్నారు. టీటీడీ బోర్డులో అన్యమతస్తులు, నేరస్థులను నియమించడం వల్లే ఇలాంటి దారుణాలు చోటు చేసుకొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. హిందువుల మనోభావాలు, విశ్వాసాలను కించపరిచే విధంగా వ్యవహరించిన ప్రతి ఒక్కరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, అధికార ప్రతినిధి ఆరికట్ల శ్రీరాములు, నాయకులు దక్కిలి చంద్రారెడ్డి, అయ్యపరెడ్డి తదితరులు పాల్గొన్నారు

శ్రీవారి లడ్డూను రాజకీయం చేయడం తగదు

నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి



కోట, సెప్టెంబరు 24: కలియుగ దైవం వెంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదంలో వినియోగించే నెయ్యి కల్తీ జరిగిందంటూ ప్రచారం చేయడం మంచి పద్ధతికాదని వైసీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి అన్నారు. కోట మండలం విద్యానగర్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తిరుమలలో ఏమి జరిగినా ఆలయ ఈవో, జేఈవోలదే బాధ్యత అన్నారు. 2019 - 2024 మధ్య నెయ్యిలో నాణ్యత లేదని 18 సార్లు ట్యాంకర్లను వెనక్కు పంపడం జరిగిందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు శ్రీవారి లడ్డూను రాజకీయం చేయడం తగదని, సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు.

అవగాహనతో దీర్ఘకాలిక వ్యాధుల నివారణ

నాయుడుపేట, సెప్టెంబరు 24: దీర్ఘకాలిక వ్యాధులైన క్షయ, హెచ్‌ఐవీ పట్ల అవగాహన కలిగి ఉండటం ద్వారా సోకకుండా నివారించవచ్చని నవజీవన్ ఆర్గనైజేషన్ ప్రాజెక్టు మేనేజర్ బాలాజీరాజు అన్నారు. నాయుడుపేట సీవీ రామన్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం క్షయ, హెచ్‌ఐవీ పట్ల అవగాహన కల్పించారు. సంబంధిత సమస్యలు ఎవరికైనా ఉంటే 1097 టోల్‌ఫ్రీ నెంబరును సంప్రదించి తగు సలహాలు, వైద్యసేవలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గాదిరెడ్డి గోపీ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాసింగాడు కుప్పంలో 'ఇది మంచి ప్రభుత్వం'

తడ, సెప్టెంబరు 24: మండల పరిధిలోని కాసింగాడు కుప్పంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. టీడీపీ నాయకులు కళానిధి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వం 100 రోజుల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, చేపట్టబోయే కార్యక్రమాల గురించి ప్రజలకు తెలియజేశారు. టీడీపీ నాయకులు రమేష్, అధికారులు పాల్గొన్నారు.

ఆర్థిక సంక్షోభంలోనూ అభివృద్ధికి బాటలు: పాశం



ఏరూరులో వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాశం, కలెక్టర్ వెంకటేశ్వర్

చిల్లకూరు, సెప్టెంబరు 24: రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నా అభివృద్ధి పథంలో నడిపిస్తున్న సమర్థవంతమైన నేత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం చిల్లకూరు మండలంలోని ఏరూరులో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పటికీ అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు ప్రజలకు సంక్షేమం, ఉద్యోగులకు సకాలంలో జీతాలు అందిస్తున్నారని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో రూ.3 వేలు ఉన్న పెన్షన్‌ను రూ.4వేలకు పెంచి ప్రతినెలా ఒకటవ తేదీనే అందజేస్తున్నారని కొనియాడారు. రూ.5లక్షలు ఉన్న చంద్రన్న బీమాను రూ.10 లక్షలకు పెంచారని తెలిపారు. దీపావళి నుంచి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా ఇళ్ల స్థలం లేని వారికి 18 అంకణాల ఇళ్ల స్థలం మంజూరుకు చర్యలు చేపట్టిందన్నారు. అదేవిధంగా పేదలు ఇళ్లు కట్టుకునేందుకు రూ.4.30 లక్షలు మంజూరు చేస్తుందన్నారు. కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమం సమపాలనతో అందించాలని సూచించడం జరిగిందని, ఈ మేరకు అధికారులందరూ పనిచేయాలన్నారు. అనంతరం గ్రామంలోని వేరుశనగ పంటను పరిశీలించారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా, వ్యవసాయశాఖ జేడీ ప్రసాద్‌రావు, డీపీవో వాణిరెడ్డి, తహసీల్దారు శ్రీనివాసులు, నాయకులు వెంకటరమణారెడ్డి, ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, పూడిపర్తి ప్రవీణ్‌కుమార్, పట్టాభిరామిరెడ్డి, మన్నెం శీనయ్య, గుండాల లీలావతి, సుప్రజ, శైలజ, చిరంజీవి, దువ్వూరు కృష్ణారెడ్డి, కీరవాణి, భైరప్ప, శివకుమార్, కుమార్‌యాదవ్, మునిశేఖర్‌గౌడ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి రహిత పాలన సాగాలి: కురుగొండ్ల



శ్రీపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

దక్కిలి, సెప్టెంబరు 24: మండల స్థాయిలో పనిచేస్తున్న అధికారులందరూ అవినీతి రహిత పాలన సాగించాలని, ఎవరు ఎలాంటి అవినీతికి పాల్పడినా చట్ట పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ హెచ్చరించారు. మంగళవారం శ్రీపురం గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం'కార్యక్రమం నిర్వహించారు. అలాగే పొలంబడి కార్యక్రమాన్ని, సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ దక్కిలి పంచాయతీలో సర్పంచు అక్రమాలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైందన్నారు. అవినీతి, అక్రమాలకు ఎవరు పాల్పడ్డా క్షమించేది లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు అందించాలని కృషిచేస్తున్నట్లు వివరించారు. ఇందులో భాగంగా రూ.3 వేలు ఇస్తున్న పింఛనను రూ.4 వేలకు పెంచడం జరిగిందన్నారు. అలాగే ల్యాండ్‌టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేసినట్లు గుర్తుచేశారు. అంతేగాక ఉద్యోగులకు జీతాలు సకాలంలో అందజేస్తున్నారని తెలిపారు. విజయవాడ వరదల సమయంలో సీఎం చంద్రబాబు ముంపు ప్రాంతాల్లో పర్యటించి అధికారులు స్వయంగా సహాయక చర్యలు తీసుకొనేలా ముందుండి నడిపించారని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో లక్ష్మీప్రసన్న, ఎంఈవోలు వెంకటేశ్వర్లు, జగదీష్ బాబు, ఏపీవో లక్ష్మీనారాయణ, వ్యవసాయశాఖ ఏడీ నాగార్జున సాగర్, టీడీపీ నాయకులు ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, పచ్చూరి నరసయ్య నాయుడు, దక్కిలి చంద్రారెడ్డి, అయ్యపరెడ్డి, ఆరికట్ల శ్రీరాములు పాల్గొన్నారు.

తిరుమల క్షేత్ర విశిష్టతను పరిరక్షించాలి



వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని శుద్ధిజలాలు, అగర్‌బత్తిలతో శుభ్రం చేస్తున్న జనసేన నేతలు, స్థానిక మహిళలు

కోట, సెప్టెంబరు 24: కలియుగ దైవం శ్రీవెంకటేశ్వరస్వామి కొలువైన తిరుమల క్షేత్ర విశిష్టతను పరిరక్షించాలని జనసేన, టీడీపీ నాయకులు అన్నారు. శ్రీవారి లడ్డూ తయారీకి వినియోగించే నెయ్యి కల్తీకి కారకులైన వారిని శిక్షించాలంటూ మంగళవారం కోట పట్టణంలోని శ్రీలక్ష్మమ్మకాలనీలో నిరసన కార్యక్రమాలు జరిగాయి. సీనియర్ జనసేన నాయకులు అల్లం బాబు, టీడీపీ అధికార ప్రతినిధి డాక్టర్ తిరుమలశెట్టి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యకర్తలు, గ్రామస్తులు పోస్టర్లను చేతపట్టుకొని ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రసన్న వెంకటేశ్వరస్వామి మూల విరాట్, ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. శ్రీవారి పవిత్రతను కాపాడాలంటూ అగర్‌బత్తీలతో దూపదీప నైవేద్యాలు చేశారు.

క్రీడలతో మానసికోల్లాసం

కోట, సెప్టెంబరు 24: క్రీడల వల్ల మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్‌కుమార్ అన్నారు. కోటలోని ఏవీకేఆర్ ఉన్నత పాఠశాలలో రెండు రోజులపాటు జరిగే నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలను మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు, గూడూరు మండలాల్లోని 75 ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల నుంచి అండర్-14, అండర్17 విభాగాల విద్యార్థులకు రన్నింగ్ రేస్, కబడ్డీ, త్రోబాల్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటితరం విద్యార్థులు మానసిక ఒత్తిళ్లకు గురవుతున్నారన్నారు. ఒత్తిడిని జయించాలంటే క్రీడ పట్ల మక్కువ పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు శైలజ, మస్తానయ్య, సర్పంచ్ వెంకటరమణమ్మ, ఉప సర్పంచ్ గాదె భాస్కర్, టీడీపీ నాయకులు సర్వోత్తమరెడ్డి, జలీల్ అహ్మద్, మధు యాదవ్, రాధాకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాగులో మెలకువలు నేర్పేందుకే 'పొలం పిలుస్తోంది'

గూడూరు అర్బన్, సెప్టెంబరు 24: సాగులో మెలకువలు నేర్పించి రైతులు అధిక దిగుబడులు సాధించేందుకే రాష్ట్ర ప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని చేపట్టిందని వ్యవసాయశాఖ ఏవో రమేష్ అన్నారు. మంగళవారం గూడూరు మండలంలోని అయ్యవారిపాళెం, మేగనూరు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పశువైద్యుడు సుదర్శన్, మహేష్‌కుమార్, గాయత్రి, శ్రీకాంత్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్: మండలంలోని భీమవరం, మేనకూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయశాఖ అధికారి గణేష్ రైతులతో సమావేశం నిర్వహించి పంట సాగులో మెలకువలపై అవగాహన కల్పించారు. రాబోవు సీజన్‌లో మంచి విత్తనాలతో వ్యవసాయాన్ని ప్రారంభించాలని ఆయన సూచించారు.

ఓజిలి: మండలంలోని బత్తలాపురం, మానమాల గ్రామాల్లో ఏవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. బత్తలాపురం గ్రామంలోని మామిడి తోటలో క్షేత్ర సందర్శన చేశారు. పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ చందన, వెటర్నరీ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కోట: మండల పరిధిలోని ఊనుగుంటపాళెం, గూడలి రైతు సేవా కేంద్రాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం జరిగింది. మండల వ్యవసాయ అధికారి నిరంజన్‌కుమార్ ఆధ్వర్యంలో ఆయా రైతు సేవా కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో సాగు చేస్తున్న పంటలను పరిశీలించారు. చీడపీడలు ఆశించిన పంటలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వరిలో విత్తనశుద్ధి, బీజామృతం ప్రాముఖ్యతను రైతులకు ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ప్రతినిధులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: మన్నారుపోలూరు, కోటపోలూరు గ్రామాల్లో ఏవో కవిత ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సాగు విధానంలో రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు.

వాకాడు: మండలంలోని కొండూరు, దుగరాజపట్నం పంచాయతీల్లో వ్యవసాయశాఖ అధికారిణి దీప ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ, అనుబంధ రంగాల్లో సాంకేతిక పద్ధతులు, సాగులో మెలుకువలు, పంట ఉత్పత్తులు, ఎరువులు, పంట తెగుల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు.

పెళ్లకూరు: రసాయనిక ఎరువుల వాడం తగ్గిస్తే భూసారం పెరిగి నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయాధికారి గొడవర్తి ప్రవీణ సూచించారు. మండలంలోని నెలబల్లి, పుల్లూరు గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. సేంద్రియ ఎరువులను వాడుకుంటే నాణ్యతతో కూడిన దిగుబడులు సాధించవచ్చునన్నారు.

ఉపాధ్యాయులకు విశిష్టసేవా పురస్కారాలు



విశిష్టసేవా పురస్కారాలు అందుకున్న ఉపాధ్యాయులు

నాయుడుపేట, సెప్టెంబరు 24: నాణ్యతా ప్రమాణాలతో కూడిన విద్య, అంకితభావంతో విద్యార్థుల క్రమశిక్షణ, అలవర్చిన ఉపాధ్యాయులకు ఏపీటీఎఫ్ విశిష్ఠ సేవల పురస్కారాలను అందసింది. నాయుడుపేటలో ఏపీటీఎఫ్ కార్యాలయంలో మంగళవారం మండలంలోని అన్నమేడు జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మధుసూదన్, దొరవారిసత్రం మండలం ఏకొల్లు ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం నరసింహారావు, ఏపీటీఎఫ్ సీనియర్ నాయకులు కేవీ రమణారెడ్డిలను శాలువా, పూలమాలలు, మెమోంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.బాలసుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడు జె.హరి, కార్యదర్శి ప్రసాద్, నాయుడుపేట అధ్యక్షుడు అల్లెయ్య, ప్రధాన కార్యదర్శులు రాజేష్, ఆనంద్, పెళ్లకూరు అధ్యక్షురాలు వై.జయలక్ష్మి, చిట్టమూరు ప్రధాన కార్యదర్శి జి.నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు పునబాకలో ఎమ్మెల్యే పర్యటన

పెళ్లకూరు, సెప్టెంబరు 24: 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం బుధవారం పునబాక పంచాయతీలో పర్యటించనున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య తెలిపారు. ప్రజాసమస్యలపై వినతులు స్వీకరించనున్నారని ఆయన తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఎన్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపక దినోత్సవం

సూళ్లూరుపేట, సెప్టెంబరు 24: సూళ్లూరుపేటలోని వీఎస్‌ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎన్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపన దినోత్సవం నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నాగభూషన్ మాట్లాడుతూ సమజాన్ని చైతన్యవంతం చేయడంతో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లది కీలక పాత్రని అన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమ నిర్వాహకులు ఏడుకొండలు, అధ్యాపకులు సునీత, బాబు, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

పులికాట్ ముఖద్వారాల పూడికతీతకు చర్యలు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 24: పులికాట్ సరస్సు ముఖద్వారాల పూడిక తీతకు చర్యలు తీసుకొంటున్నట్లు కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం సూళ్లూరుపేట మండల పరిధిలోని కోట పోలూరులో జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయశ్రీతో పాటు కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వరప్రసాదమైన పులికాట్ సరస్సుకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు సముద్రానికి, సరస్సుకు మధ్యలో పూడి రాయదొరువు వద్దనున్న ముఖద్వారాల పూడిక తీతకు సంబంధించి అన్ని చర్యలు తీసుకొంటున్నామన్నారు. ఈ ప్రాంతంలో కొరిడి-పేర్నాడు, వేనాడు గ్రామాలకు తారురోడ్లు వేసేందుకు పూర్తి స్థాయిలో అనుమతులు వచ్చే విధంగా చొరవతీసుకోవాలని, అదే విధంగా ఇరకం దీవిలో మౌలిక వసతులు కల్పించాలని ఎమ్మెల్యే కోరారని తెలిపారు. ఈ సమస్యలన్నింటిని పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ తీసుకొంటామని చెప్పారు. జలజీవన్ ద్వారా ప్రతి ఇంటికీ తాగునీరిందించేందుకు ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. ఈ ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందడమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకొంటామని, ఇందులో భాగంగా ఇకపై ఏటా ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహిస్తామన్నారు. ఎమ్మెల్యే విజయశ్రీ మాట్లాడుతూ ప్రజల ముంగిటకే ప్రభుత్వం వచ్చి చేసిన పనులు, సాధించిన విజయాలు గురించి తెలిపేందుకే ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఆదర్శవంతమైన పాలన అందించేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామిలన్నింటిని తప్పకుండా నెరవేర్చుతామని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి తెలిపారు. అనంతరం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా కౌలు రైతులకు కలెక్టర్ చేతుల మీదుగా గుర్తింపు కార్డులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, మాజీ మంత్రి పరసా వెంకటరత్నం, టీడీపీ నాయకులు నెలవల రాజేష్, తిరుమూరు సుధాకర్ రెడ్డి, శంకరయ్య, వెంకటసుబ్బయ్య, ఏ.రమేష్, ఏజీ కిషోర్, గాడి నారాయణరెడ్డి, ఐ.శ్రీవాణిరెడ్డి, ఆర్డీవో చంద్రముని, ఎంపీడీవో ప్రమీలారాణి, తహశీల్దార్ నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.



కౌలు రైతుకు గుర్తింపు కార్డు అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ఆదిశంకరలో విద్యుత్ వాహన ప్రయోగశాల



ప్రయోగశాలను ప్రారంభిస్తున్న వెంకటరెడ్డి

గూడూరు, సెప్టెంబరు 24: స్థానిక ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం విద్యుత్ వాహన సాంకేతిక ప్రయోగశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విహాన్ ఎలక్ట్రిక్స్ సీఈవో వెంకటరెడ్డి మాట్లాడుతూ ఈ ప్రయోగశాల వల్ల విద్యార్థులకు విద్యుత్ వాహనాలపై పరిశోధన, అధ్యయనం చేసేందుకు వీలుంటుందన్నారు. విద్యుత్ వాహనాల తయారీ, డ్రోన్ టెక్నాలజీ, త్రీడీ ప్రింటింగ్, మిషన్ లెర్నింగ్ వంటి ఆవిష్కరణలపై అవగాహన పెంపొందించుకునేందుకు ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులకు ఈ తరహా బోధనలను అందించడం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకుంటారన్నారు. కార్యక్రమంలో ప్రభాకరన్, నాజరాజన్, మాధవరెడ్డి, వేణుమాధవ్, బాలాజీ, ధనుంజయ, రాజయ్య, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో డీఈఈ బాధ్యతల స్వీకారం

సూళ్లూరుపేట, సెప్టెంబరు 24: సూళ్లూరుపేట ట్రాన్స్‌కో సబ్ డివిజన్ డీఈఈగా ఆర్.శేఖర్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఖాదర్ భాషా బదిలీపై నెల్లూరుకు వెళ్లడంతో ఆయన స్థానంలో నాయుడుపేటలో పనిచేస్తున్న ఆర్.శేఖర్‌ను నియమించారు. ట్రాన్స్‌కో సిబ్బంది ఆయనను కలిసి అభినందనలు తెలిపారు.



బాధ్యతలు చేపడుతున్న డీఈఈ శేఖర్

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు

తడ, సెప్టెంబరు 24: 'మన ఇల్లు.. మన గౌరవం' పథకంపై లబ్ధిదారులతో ఈ నెల 28వ తేదీ సమావేశం ఏర్పాటు చేస్తామని తహసీల్దారు శరత్‌బాబు తెలిపారు. మంగళవారం రెవెన్యూ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, గృహనిర్మాణశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ఇప్పటికే ఇళ్ల పట్టాలు పొంది నిర్మాణం చేపట్టని వారు, నిర్మాణాలు మధ్యలో ఆగిపోయిన లబ్ధిదారులతో సమావేశమై పనులు పూర్తిచేసేలా తగు చర్యలు తీసుకుంటామన్నారు. హౌసింగ్ ఏఈ సత్యనారాయణ మాట్లాడుతూ గృహ నిర్మాణం కోసం అవసరమైన మెటీరియల్‌ను సరఫరా చేస్తామని తెలిపారు. వచ్చే ఏడాది మార్చిలోపు ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసేలా ప్రభుత్వం లక్ష్యం విధించిందన్నారు. ఇందుకు అధికారులంతా సహకరించాలని కోరారు. సమావేశంలో ఎంపీడీవో విజయ్‌కుమార్, ఇరిగేషన్ ఏఈ రమేష్, పంచాయతీ కార్యదర్శులు గాబ్రియల్, మస్తాన్, ఎస్‌డి బాబు, శేషారావు, శివశంకర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణ కేసులో ఒకరి అరెస్టు

దొరవారిసత్రం, సెప్టెంబరు 24: మండలంలోని మోదుగులపాళెంలో ఈనెల 22వ తేదీ రాత్రి జరిగిన ఘర్షణలో మాయారి సుబ్రహ్మణ్యంపై కత్తితో దాడి చేసిన గాయపరచిన మాధవయ్యను మంగళవారం ఎస్‌ఐ అజయ్‌కుమార్ అరెస్టు చేశారు. నిందితుడిని సూళ్లూరుపేట కోర్టుకు హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండు విధించడంతో నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు. మిగిలిన నిందితులను కూడా త్వరలో అరెస్టు చేస్తారని ఎస్‌ఐ చెప్పారు.